RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 126 | జూన్ 06 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 126 | JUN 06 Saturday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


జపాన్‌తో కొత్త దిశ 2

# మా పాలనపై.. మీపాలనపై చర్చిద్దామా..?

## కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్:



**జడ్చర్ల జన సంఘర్షణ**
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జడ్చర్లలో నిర్వహించిన ప్రజపాలన–ప్రగతి ప్రణాళిక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. “నీ పదేళ్ల పరిపాలనకు, నా రెండున్నరేళ్ల పాలనకు మధ్య ఉన్న తేడాపై చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమేనా?” అంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు. దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలని, ఈ సవాల్‌లో తాను ఓడిపోతే దేనికైనా సిద్ధమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద వారు ఓట్లు అడగాలని, తాము కట్టించిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద కాంగ్రెస్ ఓట్లు అడుగుతుందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు వస్తే తన పేరు మార్చుకుంటానని ఆయన కుండబద్దలు కొట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లాను కేసీఆర్ పూర్తిగా వంచించారని సీఎం ఆరోపించారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను ఇక్కడి ప్రజలు ఎంపీగా గెలిపిస్తే, ఆయన కనీసం ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి కూడా రాలేదని మండిపడ్డారు. పాలమూరు గడ్డపై గెలిచి, ఆ తర్వాత ఇక్కడి నుంచి పారిపోయి గజ్వేల్‌లో పోటీ చేసిన కేసీఆర్ పాలమూరు ద్రోహి అవుతారా? లేక ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న తాను ద్రోహిని అవుతారా? అని నిలదీశారు. గత పదేళ్లలో జిల్లాలో ఒక్క ప్రాజెక్టును కూడా బీఆర్ఎస్

➤ మిగతా 2వ పేజీలో..

# రాష్ట్రంలో వేర్వేరు ఘోర విషాదాలు

- మంజీరా నదిలో మునిగి నలుగురు చిన్నారుల మృతి
- సిలిండర్ పేలి అమమ్మ సహా ఇద్దరు మనువళ్ల మృతి



**కామారెడ్డి/ మిర్యాలగూడ జన సంఘర్షణ**
కామారెడ్డి జిల్లాలో ఎల్లమ్మ పండగ వేడుకలు తీవ్ర విషాదాన్ని నింపాయి. మంజీరా నదిలో ఈతకు వెళ్లిన నలుగురు చిన్నారులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయవిదారక ఘటన స్థానికంగా తీవ్ర శోకాన్ని మిగిల్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం మంగల్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు బాన్సువాడ మండలం బుడిమి శివారులోని మంజీరా నది వద్దకు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల అనంతరం అందరూ కలిసి భోజనాలు చేశారు. ఆ తర్వాత అనిత, పావని, శ్రీవాణి, భానుప్రసాద్ అనే నలుగురు చిన్నారులు బొల్లాక్‌పల్లి సమీపంలోని మంజీరా నదిలో ఈత కొట్టేందుకు దిగారు. అయితే,

➤ మిగతా 2వ పేజీలో..

# మార్కెట్లో తగ్గుముఖం పట్టిన పసిడి, వెండి ధరలు



**న్యూఢిల్లీ జన సంఘర్షణ**
దేశీయ మార్కెట్లో పసిడి, వెండి ధరల్లో క్షీణత కొనసాగుతోంది. గత రెండు రోజులుగా స్వల్పంగా తగ్గుతూ వస్తున్న పసిడి ధరలు శుక్రవారం కూడా అదే బాటలో పయనించాయి. గత కొన్ని రోజులుగా నిలకడగా ఉన్న వెండి ధరలు సైతం ఈసారి భారీగా పడిపోవడం గమనార్హం. ప్రముఖ వెబ్‌సైట్ గుడ్ రిటర్న్స్ అందించిన తాజా వివరాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో శుక్రవారం ఉదయం సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్నటి ముగింపుతో పోలిస్తే రూ.380 మేర తగ్గి రూ.1,55,730 వద్దకు చేరింది. అదేవిధంగా, ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ.350 మేర క్షీణించి రూ.1,42,750 వద్ద స్థిరపడింది. ఇక నగరంలో వెండి ధర ఏకంగా రూ.5,000 మేర భారీ పతనాన్ని చవిచూసి, ప్రస్తుతం కిలో రూ.2.8 లక్షలుగా కొనసాగుతోంది. ఇదే రకమైన ధరల ట్రెండ్ విజయవాడ మార్కెట్లోనూ కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా సగటున చూసుకుంటే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.350 వరకు తగ్గుదల నమోదైంది. చెన్నై నగరంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,960గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,44,300గా నమోదైంది. ముంబై మార్కెట్లో ఇవి వరుసగా రూ.1,55,730, రూ.1,42,750లుగా ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీ విషయానికి వస్తే, అక్కడ 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.1,55,880 వద్ద, 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,42,900 వద్ద ట్రేడవుతున్నాయి. అయితే, మరో ట్రేడింగ్ సెషన్‌లో ఢిల్లీ మార్కెట్లో మేలిమి

➤ మిగతా 2వ పేజీలో..

# యథాతథంగా ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లు



## వృద్ధి రేటు అంచనాలు కట్!

**బొంబాయి జన సంఘర్షణ**
దేశంలో కీలక వడ్డీ రేట్లను మార్చకుండా ప్రస్తుతానికి అలాగే కొనసాగించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్ణయించింది. ముంబైలో జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్ష (ఎమ్‌పీసీ) నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. తాజా ప్రకటన ప్రకారం, రెపో రేటులో ఎలాంటి మార్పులు చేయకుండా 5.25 శాతం వద్దే స్థిరంగా ఉంచారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం విశేషం. ఇంతకుముందు జరిగిన ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లోనూ కేంద్ర బ్యాంకు రేట్లను యథాతథంగానే ఉంచింది. పశ్చిమాసియా సంక్షోభం, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అస్థిర పరిస్థితుల నడుమ దేశీయ ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ వివరించారు.
గడిచిన 2025 సంవత్సరంలో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పలుమార్లు తగ్గించింది. గత ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లలో 25 బేసిస్ పాయింట్ల చొప్పున కోత విధించిన ఆర్‌బీఐ, జూన్ నెలలో ఏకంగా 50 బేసిస్

➤ మిగతా 2వ పేజీలో..

# నగరంలో ఎబోలా భయాలు

**గాంధీ ఆసుపత్రిలో ఇద్దరు అనుమానితులకు ప్రత్యేక చికిత్స**



**హైదరాబాద్ జన సంఘర్షణ**
హైదరాబాద్ నగరంలో ఎబోలా వైరస్ కలకలం సృష్టిస్తోంది. ఈ ప్రాణాంతక వ్యాధి లక్షణాలతో ఉన్న ఇద్దరు వ్యక్తులను గుర్తించడం స్థానికంగా ఆందోళనకు దారితీసింది. ప్రాథమికంగా అపోలో ఆసుపత్రిలో చేరిన వీరిని, అనంతరం రాత్రి వేళల్లో అత్యవసరంగా సికింద్రాబాద్‌లోని గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం

## మా పాలనపై.. మీపాలనపై చర్చిద్దామా..?

**మొదటిపేజీ తరువాయి..**

పూర్తి చేయలేదని, కానీ తాము అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల్లోనే పాలమూరు ప్రాజెక్టుల కోసం రూ. 8,000 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. రాబోయే డిసెంబర్ నాటికి పాలమూరు ప్రాజెక్టుకు 90 టీఎంసీల నీటిని తరలిస్తామని, ఇందుకోసం అవసరమైతే ఆంధ్రప్రదేశ్‌తో చర్చలు జరిపి నీటి సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు కాస్తా 'కూలేశ్వరం'గా మారిందని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అంటూ బీఆర్ఎస్ ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలుగా మిగిలిపోయాయన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 15 లక్షల కొత్త రేషన్ కార్డులు, 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గుర్తుచేశారు. అలాగే మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ. 10,000 కోట్లు కేటాయించామని చెప్పారు. పాలమూరులో వలసలు ఆపడమే తన ప్రధాన లక్ష్యమని, అందుకే కొడంగల్‌లో భారీ ఎడ్యుకేషన్ హబ్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేసిన ఈ సభలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి మరియు స్థానిక శాసనసభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వేర్వేరు ఘోర విషాదాలు

**మొదటిపేజీ తరువాయి..** నదిలో ఉన్న ఊబిని గమనించని చిన్నారులు అందులో చిక్కుకుపోయి నీట మునిగారు. చిన్నారులు నీటిలో మునిగిపోతుండటం గమనించిన సమీపంలోని ఒక మహిళ వారిని కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించింది. ఈ క్రమంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ఆ మహిళను రక్షించారు. అనంతరం నదిలో గాలింపు చర్యలు చేపట్టి, ఊబిలో చిక్కుకున్న చిన్నారులను బయటకు తీశారు. అయితే అప్పటికే వారు మృతి చెందారు. మరణించిన చిన్నారులంతా పదేళ్ల లోపు వయసు వారేనని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే బొల్లాక్‌పల్లి ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పండగ సంతోషంలో ఉన్న ఇళ్లల్లో ఒకేసారి నలుగురు చిన్నారులు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

మిర్యాలగూడలో ఘోర ప్రమాదం: అర్ధరాత్రి సిలిండర్ పేలి అమ్మమ్మ, ఇద్దరు మనవళ్లు సజీవదహనం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో అర్ధరాత్రి వేళ గుండెల్ని పిండేసే విషాదం చోటుచేసుకుంది. ఒక ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో అమ్మమ్మతో పాటు ఆమె ఇద్దరు మనవళ్లు అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. మృతులను వనం చంద్రకళ, ఆమె మనవడు లక్ష్మణ్ (16), మనవరాలు ప్రణతి (14)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడ ప్రాంతానికి చెందిన చంద్రకళ భర్త సైదులు కొద్దిరోజుల క్రితమే అనారోగ్యంతో కన్నుమూశారు. చంద్రకళ పెద్ద కుమార్తె ధనమ్మ భర్త కూడా పదేళ్ల క్రితమే మరణించడంతో, ఆమె తన ఇద్దరు పిల్లలైన లక్ష్మణ్, ప్రణతిలతో కలిసి తల్లిగారి ఇంట్లోనే నివాసం ఉంటోంది. బతుకుదెరువు కోసం ఇళ్లలో పని చేసేందుకు ధనమ్మ మూడు రోజుల క్రితమే పుణే నగరానికి వెళ్లింది. ఈ క్రమంలో గురువారం రాత్రి చంద్రకళ తన మనవడు, మనవరాలితో కలిసి రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ సంభవించింది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. నిద్రలో నుంచి లేచిన వారు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తుండగానే, ఇంట్లోని గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో ఇల్లు పూర్తిగా మంటల్లో చిక్కుకుపోవడంతో ముగ్గురు కూడా బయటపడలేక అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అనంతరం లోపలి నుంచి మృతదేహాలను వెలికితీశారు. డీఎస్పీ రాజశేఖర్ రాజు ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కాలిపోయిన మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర

### 7న పోలీస్ సిబ్బందితో 'థీమ్ యోగా' కార్యక్రమం

### కలెక్టర్ లక్ష్మీ శా వెల్లడి

**విజయవాడ, జూన్5 :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జూన్ 7 నుంచి జూన్ 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర 2026 నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీ శా వెల్లడించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, ప్రతి ఇంటికీ యోగాను చేరువ చేయడం ప్రధాన లక్ష్యమన్నారు. 'థీమ్ యోగా' కార్యక్రమం ఈనెల 7న పోలీస్ సిబ్బందితో నిర్వహిస్తామన్నారు. ఆ తర్వాత పర్యాటక ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పవిత్ర సంగమం దగ్గర 10వ తేదీన యోగాను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ 15, 16, 17 తేదీల్లో యోగా ఒలింపియాడ్ పోటీలను ప్రభుత్వం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని కార్పొరేషన్స్, మున్సిపాలిటీ లెవెల్‌లో 5000 మందికి పైగా యోగా ట్రైనర్స్‌గా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ 5000 మంది యోగా టీచర్స్.. ప్రజలకు యోగా శిక్షణ కార్యక్రమాలను 15 రోజుల పాటు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలాగా ఆయా ప్రదేశాలలో యోగా సాధన ద్వారా అధిక సంఖ్యలో

## యథాతథంగా ఆర్‌బీఐకీలక వడ్డీ రేట్లు

**మొదటిపేజీ తరువాయి..** పాయింట్లు, ఆ తర్వాత డిసెంబరులో మరో పావు శాతం తగ్గించింది. దీనివల్ల గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం మేర దిగివచ్చింది. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితిలో ఉన్నప్పటికీ, భారతదేశం ఎలాంటి సవాళ్లనైనా తట్టుకుని నిలబడగలదనే నమ్మకాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు. అయితే, ఇంధన ధరల పెరుగుదల వల్ల వృద్ధి నెమ్మదించడం, ద్రవ్యోల్బణం పెరగడం వంటి సవాళ్లు ఉన్నాయని, దీనికి తోడు ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అయినప్పటికీ, దేశంలో సరిపడా ఆహార నిల్వలు ఉండటం ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ తగ్గడం, రవాణా ఖర్చులు పెరగడం ఎగుమతులకు ఇబ్బందిగా మారినప్పటికీ, దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు బలంగానే సాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ దేశ జీడీపీ (+ఖా) వృద్ధి రేటు అంచనాలను ఆర్‌బీఐ 6.9 శాతం నుండి 6.6 శాతానికి తగ్గించింది. అదే సమయంలో రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను 4.6 శాతం నుండి 5.1 శాతానికి పెంచింది. విదేశీ పెట్టుబడులను మరింతగా రాబట్టేందుకు వీలుగా ప్రభుత్వ బాండ్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు (ఖీ×) నిబంధనలను సులభతరం చేసినట్లు గవర్నర్ వెల్లడించారు. అలాగే, దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ఎన్ఆర్ఐలు (చీ=×), ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడులు పెట్టే పరిమితిని కూడా పెంచారు. ఎక్స్ఛేంజ్ రేటు విషయానికొస్తే.. రూపాయి విలువకు సంబంధించి ఎలాంటి నిర్దిష్ట పరిమితులను విధించదలచుకోలేదని, రూపాయి స్థిరత్వంపై ఆర్‌బీఐ పాత విధానమే కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల తలెత్తే ఎలాంటి ఆర్థిక సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ పూర్తి అప్రమత్తతతో ఉందన్నారు.

# మార్కెట్లో తగ్గుముఖం పట్టిన పసిడి, వెండి ధరలు

**మొదటిపేజీ తరువాయి..** బంగారం ధర రూ.700 పెరిగి రూ.1,60,300కు చేరగా, వెండి ధర మాత్రం రూ.3,800 తగ్గి రూ.2,65,700 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఒడిదొడుకుల కారణంగా ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల బంగారం ధరలు 4,444 డాలర్ల నుండి 4,472 డాలర్ల మధ్య కదలాడుతుండగా, వెండి ధరలు ఔన్స్‌కు 72 డాలర్ల నుండి 73.56 డాలర్ల పరిధిలో కొనసాగుతున్నాయి. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుండి తమ నిధులను నిరంతరాయంగా వెనక్కి తీసుకోవడం వంటి పరిణామాలు మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇన్వెస్టర్లు కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు వెనుకాడుతూ, వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నారు. విదేశీ ఇన్వెస్టర్లు బుధవారం నాడు రూ.5,616.56 కోట్లు, గురువారం నాడు రూ.4,447.06 కోట్ల విలువైన నికర విక్రయాలకు పాల్పడ్డారు. ఇదే సమయంలో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 2 పైసలు బలపడి రూ.95.74 వద్ద ముగియగా, అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర ఒక దశలో 2.5 శాతానికి పైగా క్షీణించి బ్యారెల్‌కు 95.33 డాలర్లకు పడిపోయింది.

## దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

### అత్మనిర్భర్ భారత్', దేశ దృఢ సంకల్పన్ని విమర్శిస్తుంటారు

### సూరత్ సభలో రాహుల్‌పై ప్రధాని మోడీ పరోక్ష విమర్శలు

**న్యూఢిల్లీ, జూన్5 :**

దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'అత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పన్ని విమర్శించడమే వీళ్లు పనిగా పెట్టుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అలజడులు, అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా అవకాశాలు పొందాలని కోరుకుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తున్నారని ప్రధాని అన్నారు. 'గుజరాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందుకే ముఖ్యమంత్రిని కూడా మార్చాల్సి వచ్చిందని

ఇటీవల అక్కడ జరిగిన పరిణామలపై మోదీ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తమ కలలు, ఆకాంక్షలను కార్యరూపంలోకి రావాలనే పట్టుదలతో ఉన్నారని, దేశ ప్రజల సమష్టి సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అనేక సంక్షోభాలను ప్రపంచం ఎదుర్కొందని, తొలుత కోవిడ్ సంక్షోభం, ఆ తర్వాత ఇంధన సంక్షోభం కుదిపేసిందని అన్నారు. పెట్రోల్ ధరల్లో నిలకడ లేకపోవడం, సప్లయ్ చైన్స్ కుప్పకూలడం వంటివి చోటచేసుకున్నాయని, అయితే ప్రతి సంక్షోభాన్ని 140 కోట్ల మంది ప్రజలు సమష్టిగా ఎదుర్కోవడం తనకెంతో తృప్తినిచ్చిందని అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా సూరత్‌లో రూ.18,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

## నగరంలో ఎబోలా భయాలు

**మొదటిపేజీ తరువాయి..** ఎమర్జెన్సీ వార్డులో ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో వీరికి చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం గమనిస్తున్న వైద్యులు, వారికి అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. అనుమానిత రోగులు ఇటీవల ఏయే ప్రాంతాలకు ప్రయాణించారు, వారి కుటుంబ సభ్యుల వైద్య చరిత్ర ఏమిటి, అలాగే గత కొన్ని రోజులుగా వారు ఎవరెవరిని కలుసుకున్నారు అనే అంశాలపై అధికారులు లోతుగా వివరాలను సేకరిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు ఆరోగ్య శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ నిశితంగా పర్యవేక్షిస్తోంది. ఆఫ్రికా దేశమైన కాంగోలో ఎబోలా వైరస్ తీవ్ర రూపం దాల్చడంతో, ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ఇప్పటికే దీనిని అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. అత్యంత అరుదైన మరియు ప్రమాదకరమైన వైరస్ జాబితాలో ఉండే ఎబోలాకు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన టీకా అందుబాటులో లేకపోవడంతో దీని వ్యాప్తిని అడ్డుకోవడం వైద్య రంగానికి పెద్ద సవాల్‌గా మారింది. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని అంతర్గత ఘర్షణలు ఉన్న ప్రాంతాల్లో ఈ కేసులు ఎక్కువగా వెలుగుచూస్తున్నాయని, ఈ మహమ్మారి అంచనాలకు మించి వేగంగా విస్తరిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో అనుమానిత కేసులు నమోదు కావడం వైద్య వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

## తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాల

### దారులు చూపుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

### మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, జూన్5 :** ప్రపంచ ఉద్యోగ విపణిలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా తెలంగాణ యువతను సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటీఐలు) అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) తీర్చిదిద్దిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భ వనరుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ కేంద్రాలు కేవలం శిక్షణా సంస్థలుగానే కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరియు అంతర్జాతీయ కెరీర్‌లకు ద్వారాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. మల్లేపల్లి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను మీడియా ప్రతినిధులతో కలిసి సందర్శించిన అనంతరం మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ట్రైనర్లు ఏటీసీల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఆధునిక యంత్రాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను ప్రదర్శించారు. ఃూష్ట్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) భాగస్వామ్యంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీలు) ఏర్పాటుకు సుమారు రూ.4,000 కోట్ల విలువైన అత్యాధునిక సాంకేతిక మౌలిక సదుపాయాలు, శిక్షణా వనరులను సమకూర్చింది. టీసీల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం స్టైపెండ్లు కూడా అందజేస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఆధునిక నైపుణ్యాల సాధనకు అడ్డంకిగా మారకుండా చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు అనుగుణంగా శిక్షణా సంస్థలను ఆధునీకరించడం ద్వారా భవిష్యత్ పరిశ్రమల అవసరాలను తీర్చగల అత్యున్నత నైపుణ్యాలున్న మానవ వనరులు సిద్ధమవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను పెంపొందించడమే కాకుండా రాష్టాన్ని దేశంలోనే నైపుణ్యాభివృద్ధి రంగంలో అగ్రగామిగా నిలబెడుతుందని అన్నారు.

ఐటీఐల మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు శిక్షకులు, బోధకులకు కూడా విస్తృత స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తద్వారా విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నాణ్యమైన విద్య, ప్రాక్టికల్ శిక్షణ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నైపుణ్యవంతమైన మానవ వనరులను తీర్చిదిద్దడంలో ఏటీసీలు కీలక పాత్ర పోషిస్తాయని, తెలంగాణను దేశంలో ప్రముఖ నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా నిలబెట్టడంలో ఇవి మైలురాయిగా మారతాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. సందర్భంగా మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శనతో పాటు సాంకేతిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జపాన్-తెలంగాణ సహకారానికి కొత్త దిశ..

### ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో అవకాశాలపై చర్చలు

**హైదరాబాద్, :** జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌కు చెందిన ప్రతినిధి బృందం శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భశాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామితో సమావేశమైంది. ఈ సమావేశాన్ని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) సమన్వయం చేసింది. సమావేశంలో జపాన్ ప్రతినిధులు వివిధ పరిశ్రమలు, రంగాల్లో భారత యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల గురించి మంత్రికి వివరించారు. తెలంగాణ?జపాన్ మధ్య నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాల విస్తరణ, శిక్షణ పొందిన మానవ వనరుల అభివృద్ధి వంటి అంశాలపై పరస్పర సహకార అవకాశాలపై చర్చలు జరిగాయి. హైదరాబాద్‌తో జపాన్ నగరాల అనుబంధానికి రెండు దశాబ్దాల చరిత్ర ఉందని, ప్రస్తుతం ఆ భాగస్వామ్యం 20వ సంవత్సరాన్ని జరుపుకుంటోందని ప్రతినిధి బృందం పేర్కొంది. ఈ సందర్భంగా మంత్రి డా. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. రాష్ట్ర యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో, వారి ఉపాధి సామర్థ్యాలను పెంపొందించడంలో


జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక


# డ్వాక్రా సంఘంలో నకిలీ సంతకాల కలకలం

- సభ్యులకు తెలియకుండానే 'రూ. లక్ష' లోన్ స్వాహా

కారేపల్లి జూన్ 05 (జన సంఘర్షణ)

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని గంగారం తండాలో డ్వాక్రా మహిళా సంఘంలో భారీ అక్రమాలు వెలుగుచూశాయి. గ్రామానికి చెందిన 'పుష్ప' మహిళా పొదుపు సంఘం సభ్యుల అనుమతి లేకుండా, వారి నకిలీ సంతకాలను ఫోర్జరీ చేసి రూ. లక్ష రుణాన్ని మంజూరు చేయించుకున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. గత పదేళ్లుగా పది మంది సభ్యులతో క్రమశిక్షణగా నడుస్తున్న ఈ గ్రూప్‌లో.. సెకండ్ లీడర్, బుక్ కీపర్ సహకారంతో సభ్యులెవరికీ తెలియకుండా నకిలీ తీర్మానాలు సృష్టించి ఈ మోసానికి పాల్పడ్డారు. తీరా రుణం మంజూరైన తర్వాత బ్యాంకు అధికారులు సభ్యులందరినీ రమ్మనడంతో ఈ దారుణం శుక్రవారం విలేకరుల సమావేశంలో బయటపడింది. మొదట ఫస్ట్ లీడర్‌ను మచ్చిక చేసుకుని ఈ వ్యవహారాన్ని నొక్కేయాలని చూసినప్పటికీ, ఆమె మిగిలిన సభ్యులందరికీ సమాచారం అందించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై సెకండ్ లీడర్‌ను నిలదీయగా.. తానేం తప్పు చేయలేదని, ఏపీఎం సూచనల మేరకే ఈ రుణం తీసుకున్నానని సమాధానమివ్వడం గమనార్హం. అంతేకాకుండా, సంఘ తీర్మానాల పుస్తకంలోని 7, 8వ పేజీలను సైతం చింపేయడం ఈ అక్రమాలకు బలమైన సాక్ష్యంగా మారుతోందని, దీని వెనుక పెద్ద స్కామే ఉందని సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ అనుమతి లేకుండా సంతకాలు ఫోర్జరీ చేయడం తీవ్ర నేరమని పేర్కొన్న సభ్యులు, ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెకండ్ లీడర్‌తో పాటు



సంబంధిత అధికారులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విషయమై మండల ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు వివరణ ఇస్తూ.. తమకు కూడా ఈ వ్యవహారంపై సమాచారం అందిందని, సభ్యుల అనుమతి లేకుండా ఫోర్జరీ సంతకాలతో లోన్ పొంది ఉంటే గనుక సంబంధిత వివోఏ (ఖూూా) పై శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఇల్లందులో ప్రైవేట్ స్కూళ్ల దందా: 'బుక్' అయిపోతున్న తల్లిదండ్రులు

- ఇల్లందు విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు ఎందుకుంది?: ప్రైవేట్ స్కూళ్లు, బుక్ స్టాల్స్ సిండికేట్ దోపిడీ
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇల్లందులో అమలు కావా?: పుస్తకాల మాఫియాపై విద్యాశాఖ మౌనం వెనుక మర్మమేమిటి?
- ఇల్లందులో అక్షరాల వెనుక అక్రమ దందా: ఎల్‌కేజీ పుస్తకాల ధర రూ. 9 వేలా? అధికారులారా సమాధానం చెప్పండి!

ఇల్లందు జూన్ 05 (జన సంఘర్షణ)

**నిబంధనలు కాగితాలకే పరిమితమా?**

ఇల్లందు పట్టణంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కుతూ ఫీజుల దోపిడీకి తెరలేపాయి. విద్యాశాఖ నిబంధనల ప్రకారం తల్లిదండ్రులు తమకు నచ్చిన చోట, నచ్చిన పబ్లిషర్ పుస్తకాలు కొనుగోలు చేసే స్వేచ్ఛ ఉంది. కానీ ఇల్లందులో ఆ చట్టం ఎందుకు అమలు కావడం లేదు? అధికారులు ఈ నిబంధనలను కేవలం కాగితాలకే పరిమితం చేశారా?

**సిండికేట్ దందాపై చర్యలు ఏవి?**

పాఠశాలల యాజమాన్యాలు, పట్టణంలోని పలు బుక్ స్టాల్స్ ముందస్తు ఒప్పందాలతో సిండికేట్‌గా మారాయి. నిర్దేశిత స్కూల్ పుస్తకాలు కేవలం వారు ఎంపిక చేసిన బుక్ స్టాల్స్‌లోనే లభించేలా కుట్ర పన్నారు. ఈ బహిరంగ దందాపై విద్యాశాఖ ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది?

**'ప్రత్యేక ఎడిషన్' పేరిట దోపిడీ నిజం కాదా?**

ఎక్కువ కమీషన్ల కోసం ప్రైవేట్ స్కూళ్లు విద్యార్థులపై 'ప్రత్యేక ఎడిషన్' పుస్తకాలను బలవంతంగా రుద్దుతున్నాయి. ఈ పుస్తకాలు బయట మార్కెట్‌లో దొరకవు అని చెప్పడం వెనుక ఉన్న మర్మమేమిటి? దీనిపై విద్యాశాఖ నిఘా వర్గాలు ఎందుకు విఫలమయ్యాయి?

**ఎల్‌కేజీ పుస్తకాలకు రూ. 9వేలా?**

కనీస విజ్ఞానం లేని ఎల్‌కేజీ తరగతి పుస్తకాల ధర రూ. 4000 నుండి రూ. 9000 వరకు ఉండటం ఏ చట్టం పరిధిలోకి వస్తుంది? ఇక 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థుల పుస్తకాల ధరలు రూ. 10 వేల నుండి రూ. 20 వేల పైమాటే పలుకుతుంటే, ఈ ధరలను నియంత్రించే నాథుడే లేడా?

**పేద తల్లిదండ్రుల మనోవేదన ప్రభుత్వానికి వినపడట్లేదా?**

కక్కుర్తితో ప్రైవేట్ యాజమాన్యాలు చేస్తున్న ఈ దందా వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు




అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నాయి. ఒకే ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే ఆ తల్లిదండ్రుల మనోవేదన వర్ణనాతీతంగా మారింది. ప్రభుత్వం ఈ సామాన్యుల ఆక్రందనలను ఎప్పుడు ఆలకిస్తుంది?

**విద్యాశాఖ అధికారుల మౌనం వెనుక ఉన్న రహస్యమేమిటి?**

గత ఏడాది కాలంగా తల్లిదండ్రుల నుండి ఎన్ని ఫిర్యాదులు, వినతులు వెళ్లినా డీఈఓ కార్యాలయం కానీ, స్థానిక విద్యాశాఖ అధికారులు కానీ నోరు విప్పకపోవడం వెనుక ఉన్న రహస్యమేమిటి? కనీసం ఒక్క తనిఖీ లేదా ఒక నోటీసు కూడా ఇవ్వకపోవడానికి కారణం ఏమిటి?

**అధికారులు కమీషన్ల ముందు మోకరిల్లారా?**

అధికారుల ఈ సుదీర్ఘ మౌనం ప్రైవేట్ యాజమాన్యాల దోపిడీకి పరోక్ష అనుమతి ఇచ్చినట్లు కాదా? "అధికారులు స్కూల్ యాజమాన్యాల కమీషన్ల ముందు మోకరిల్లారా?" అని స్థానిక తల్లిదండ్రులు బహిరంగంగా వ్యక్తపరుస్తున్న అసహనానికి విద్యాశాఖ సమాధానం చెప్పగలదా?

**నిబంధనలు ఉల్లంఘించే స్కూళ్ల గుర్తింపు రద్దు చేయరా?**

ప్రత్యేకంగా తాము సూచించిన బుక్ స్టాల్స్ వద్దే పుస్తకాలు కొనాలని బలవంతం చేస్తున్న పాఠశాలల గుర్తింపును తక్షణమే ఎందుకు రద్దు చేయకూడదు? ప్రభుత్వ నిబంధనలను ధిక్కరిస్తున్న ఈ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టాలు అడ్డువస్తున్నాయా?

**ఆ బుక్ స్టాల్స్ లైసెన్సులు సస్పెండ్ అయ్యేది ఎప్పుడు?**

పాఠశాలలతో అక్రమ ఒప్పందాలు కుదుర్చుకొని, కృత్రిమ కొరత సృష్టిస్తూ, అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్న బుక్ స్టాల్స్ లైసెన్సులను ఎందుకు సస్పెండ్ చేయడం లేదు? బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగానికి లేదా?

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలు ఇల్లందులో అమలు కావా?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేదలకు న్యాయం చేయాలని, అవినీతిపై చిత్తశుద్ధితో పనిచేయాలని సూచిస్తోంది. కానీ ఇల్లందులోని అధికారులు మాత్రం ఆ దిశగా ఎందుకు చర్యలు చేపట్టడం లేదు? ఈ విద్యా దోపిడీ సిండికేట్‌పై ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉన్నతాధికారులచే విచారణ జరిపించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇల్లందు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మహబూబాబాద్‌లో మొక్కలు నాటిన డీఎస్పీ

- రోటరీ క్లబ్ ట్రెజరర్ శంతన్ రామరాజు ఆధ్వర్యంలో పర్యావరణ వేడుకలు

మహబూబాబాద్ జూన్ 05 (జన సంఘర్షణ)

పర్యావరణ పరిరక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని మహబూబాబాద్ డీఎస్పీ నంబూరు తిరుపతి రావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ తిరుపతి రావు మొక్కలు నాటి, ప్రకృతిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై సందేశాన్ని ఇచ్చారు. పుడమితల్లికి పచ్చటి పందిరి వేయాలనే రోటరీ క్లబ్ సంకల్పం ఎంతో గొప్పదని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ తిరుపతి రావు మాట్లాడుతూ.. రోజురోజుకూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న మనిషి ప్రకృతికి దూరంగా జరిగిపోతుండటం ఆవేదన కలిగిస్తోందన్నారు. మానవాళి క్రమశిక్షణ లేని చర్యల వల్లే భూగోళం వేడెక్కి వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. చెట్ల నరికివేత, భూగర్భ వనరుల విచ్చలవిడి వినియోగం, ప్లాస్టిక్ మహమ్మారి వాడకం మానవ మనుగడకు గొడ్డలిపెట్టుగా




మారాయని, ఓజోన్ పొరకు చిల్లులు పడి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని హెచ్చరించారు. ఇకనైనా ప్రతి ఒక్కరు బాధ్యతగా అడవులను రక్షించుకుంటూ విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. సమాజాభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణలో రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను డీఎస్పీ ప్రత్యేకంగా కొనియాడారు. ముఖ్యంగా విద్యా, వైద్యం, పర్యావరణం, శాంతిస్థాపన మరియు సామాజిక రుగ్మతలపై రోటరీ క్లబ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు సమాజానికి దిక్సూచిలా నిలుస్తున్నాయని ప్రశంసించారు. ప్రకృతిని కాపాడేందుకు రోటరీ క్లబ్ తీసుకుంటున్న ఇటువంటి పచ్చదనం కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ట్రెజరర్ శంతన్ రామరాజు కీలక పాత్ర పోషించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ముందడుగు వేశారు. ఆయనతో పాటు డిస్ట్రిక్ట్ లీడర్ వద్దుల సురేందర్, సెక్రెటరీ జంగాల విజయ్ కుమార్, డిస్ట్రిక్ట్ లీడర్లు బిక్కి వెంకటేశ్వర్లు, కొడారి నాగేందర్, జంగాల నర్సింహారావు, జంగాల మంగపతి రావు, అచ్చ శ్రీనివాస్, కట్ల వెంకన్న తదితర రోటరీ క్లబ్ ప్రతినిధులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

# మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం

- లోయలో పడ్డ టెంపో ట్రావెలర్, 17 మందికి తీవ్ర గాయాలు

చింతూరు జూన్ 05 (జన సంఘర్షణ)



తూర్పు మన్యం పరిధిలోని మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో ఒక టెంపో మినీ బస్ (ట్రావెలర్) ప్రమాదవశాత్తు లోయలో పడిపోయింది. ఈ ప్రమాద సమయంలో వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో 17 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఘాట్ రోడ్డులోని ప్రమాదకరమైన మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్థానికులు, ప్రయాణికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చింతూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, ప్రయాణికులు ఏ ప్రాంతానికి చెందినవారనే సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

## ఇల్లందులో పర్యావరణ దినోత్సవం: మొక్కలు నాటిన మున్సిపల్ చైర్‌పర్సన్

ఇల్లందు జూన్ 05 (జన సంఘర్షణ)



ఇల్లందులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఫిల్టర్ బెడ్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, భవిష్యత్ తరాల కోసం అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. సందీప్, ఏఈ నవీన్, ఫిల్టర్ బెడ్ ఇన్‌చార్జి ఫయాజ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇల్లందు 4వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ

- మొక్కపాటిన మున్సిపల్ చైర్‌పర్సన్

ఇల్లందు జూన్ 05 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో, కౌన్సిలర్ కుష్బూ మున్నాభాయ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ అర్హులైన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని, ప్రతి అర్హురాలికి ప్రభుత్వ ఫలాలు అందేలా మున్సిపాలిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఆజం, వార్డ్ ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది, ఆర్‌పీలు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## భద్రాచలం ఆటో డ్రైవర్లకు డీఎస్పీ అరుణ్ కుమార్ కౌన్సిలింగ్

- భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని దిశా నిర్దేశం

భద్రాచలం జూన్ 05 (జన సంఘర్షణ)




భద్రాచలం పుణ్యక్షేత్రానికి నిత్యం దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులు, ప్రయాణికులతో ఆటో డ్రైవర్లు అత్యంత మర్యాదగా ప్రవర్తించాలని భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలో ఉన్న ఆటో డ్రైవర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై, వారికి పలు కీలక సూచనలతో కూడిన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ ఒక్క డ్రైవర్ కూడా మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ఇది ప్రయాణికుల ప్రాణాలతో పాటు వారి కుటుంబాల భద్రతకు కూడా ముప్పని హెచ్చరించారు. పట్టణానికి వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సత్ప్రవర్తనతో మెలగుతూ వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని డ్రైవర్లకు దిశా నిర్దేశం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించకుండా, ప్రయాణికుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ భద్రాచలం పట్టణ కీర్తి ప్రతిష్ఠలను కాపాడాలని డీఎస్పీ డ్రైవర్లను కోరారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## బీజేపీ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం: 'కొత్త పెన్షన్లు ఇవ్వరా' అని శీలం విద్యాసాగర్ ప్రశ్న

కొత్తగూడెం జూన్ 05 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా రాబోయే తరాలకు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో విరివిగా మొక్కలు నాటాలని, చిన్న మొక్కలను పెద్ద వృక్షాలుగా తీర్చిదిద్దే బాధ్యతను పిల్లలకు నేర్పించాలని పిలుపునిచ్చారు. ఇదే వేదికపై నుంచి రాష్ట్ర ప్రభుత్వంపై శీలం విద్యాసాగర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్నది 'ప్రజా పాలనా.. లేక పేపర్ల పాలనా?' అంటూ ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నేళ్లవుతున్నా (ప్రభుత్వం వచ్చి 2 1/2 సంవత్సరాలు దాటినా) కనీసం ఒక్కటంటే ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని మండిపడ్డారు. ప్రతిసారీ పెన్షన్ల కోసం కేవలం అప్లికేషన్లు తీసుకోవడానికే ఈ ప్రభుత్వం పరిమితమైందని ఆయన ఆరోపించారు. పేద వృద్ధులు, అర్హులైన లబ్ధిదారులు పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారని, కాలయాపన చేయకుండా ఈసారైనా కొత్త పెన్షన్లను తక్షణమే మంజూరు చేసి లబ్ధిదారులను ఆదుకోవాలని శీలం విద్యాసాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం — తెలుగు దినపత్రిక
శనివారం 06 జూన్ 2026

# సింగరేణి వసుమతి ఆత్మహత్య: కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాకు టీబీజీకేఎస్ డిమాండ్

- సింగరేణిలో ఆడబిడ్డకు రక్షణ ఏది?: వసుమతి మృతిపై విచారణ జరిపించాలని వినతి!
- సింగరేణి అప్రెంటిస్ వసుమతి అనుమానాస్పద మృతి: వేధింపులే కారణమా?

కొత్తగూడెం జూన్ 05 (జన సంఘర్షణ)

**సింగరేణి అప్రెంటిస్ వసుమతి మృతి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఏరియా గ్రాంఖ-5 ఇంక్లైన్ (5 షాఫ్ట్) పరిధిలో అప్రెంటిస్‌గా పనిచేస్తున్న గిరిజన యువతి బిజ్జ వసుమతి (23) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలానికి చెందిన ఈమె, కొత్తగూడెంలోని బాబుక్యాంపులో అద్దె ఇంట్లో నివసిస్తూ సింగరేణిలో అప్రెంటిస్ చేస్తోంది.

**వేధింపుల వల్లే బలవన్మరణం**

ఎన్నో ఆశలతో చదువుకుని, సింగరేణిలో ఉద్యోగం సాధించాలనే ఆశయంతో వసుమతి అప్రెంటిస్‌గా చేరింది. అయితే, కొందరి వేధింపుల కారణంగానే ఆమె తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడాల్సి వచ్చిందని, ఇది అత్యంత బాధాకరమైన విషయమని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఆవేదన వ్యక్తం చేసింది.

**కేసీఆర్ ఆశయాలకు గండి**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) గవిశాల దృక్పథంతో సింగరేణిలో ఆడబిడ్డలకు సైతం ఉద్యోగ అవకాశాలు కల్పించారని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన చోట ఇలాంటి వేధింపుల ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమని వారు పేర్కొన్నారు.



**హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి**

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వసుమతిని గమనించిన స్థానికులు మొదట కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతూ పరిస్థితి విషమించడంతో వసుమతి బుధవారం కన్నుమూసింది.

**రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**

మరణించిన వసుమతిని తిరిగి వారి కుటుంబానికి తీసుకువచ్చి ఇవ్వలేమని, కానీ ఆ కుటుంబానికి ఓదార్పుగా సింగరేణి యాజమాన్యం మానవతా దృక్పథంతో కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని టీబీజీకేఎస్ యూనియన్ డిమాండ్ చేసింది. బాధిత గిరిజన కుటుంబానికి న్యాయం జరిగే వరకూ సంఘం తరపున పోరాడుతామని స్పష్టం చేసింది.

**నిందితులను కఠినంగా శిక్షించాలి**

వసుమతి ఆత్మహత్యకు కారకులైన వారు ఎంతటి వారైనా, ఏ హోదాలో ఉన్నా సింగరేణి యాజమాన్యం తక్షణమే విచారణ జరిపించి శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాధ్యులపై కఠిన చట్టాలను ప్రయోగించాలని యాజమాన్యాన్ని కోరారు.

**కేసు నమోదు చేసిన పోలీసులు**

మృతురాలి సోదరి శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వసుమతి మృతదేహానికి జిల్లా సర్వజన ఆసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘోర ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య, లీగల్ అడ్వైజర్ జీ.కే సంపత్, సంయుక్త కార్యదర్శి వసికర్ల కిరణ్ కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు కాగితాపు విజయ్ కుమార్, ఎం.టెక్ మహేందర్, పీవీకే ఫిట్ సెక్రటరీ నమిల్ల వెంకటేశ్వర్లు, రవివర్మ తదితర నాయకులు పాల్గొని వసుమతి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# జెలసీ

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 05, (జన సంఘర్షణ):



జెలసి కొందరికి దేవుడిచ్చిన శాపం
వ్యక్తి అందాన్నో వర్చస్సునో
ప్రతిభనో పరిణతనో ఎత్తునో ఎదుగుదలనో
చేరుకోలేని దౌర్భాగ్యం
వాడి వికల మనసును ప్రస్ఫుటం చేస్తుంది
జెలసి వెక్కిరిస్తుంది వెటకరిస్తుంది
మరికొందరి జెలసి గాళ్ళ
మనువుతో సకిలిస్తుంది కాల్జారుతుంది
ఓటములు, ఆటంకాలులూ అవరోధాలూ..
ఎన్నైనారానీ..
విత్తు ధరణి ని చీల్చి
నింగికేగి ఫల మిచ్చినట్లు
ప్రతిభ కలవాడి పయనమాగదు
మూర్ఖుడి ధ్యాసంతా పెంట పురుగు సంతోషమే...
ప్రతిభతోనో పరిణితతోనో అధిగమించాలని కాదు
కుళ్ళు తో కుమిలిలిపోతూ వ్యర్థజీవిత లక్ష్యాలతో
తన సమయం కోల్పోవడమే
మళ్లీ పుడతావా ఏంది..?
విజేతైనా పరాజితైన లక్షశుద్దే కారణం
విజయం పై విజేత లక్ష్యం
విజేతపై కులీనుడిలక్ష్యం
ఎన్ని కుట్రలు దాటితే విజయం వరిస్తుందో
విజేతకు తెలిసినంత కుత్సితుడికేం తెలుసు..?
విజేతల విజయగర్వమే పిశాచగణాల గెలవటం

**-కొండూరి. కోటిబాబు, హైకోర్టు అడ్వకేట్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్.**

# టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 05, (జన సంఘర్షణ) :

కూకట్ పల్లి నియోజకవర్గంలో శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో సత్యం శ్రీరంగం పుట్టిన రోజును పురస్కరించుకొని కేపిహెచ్బి టెంపుల్ బస్ స్టాప్ లో కేపిహెచ్బి కల్చరల్, వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేష్ శంకర్ గౌడ్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో శ్రావణి హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్త, శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్‌పర్సన్ శ్రీరంగం ఇందుమతి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ ముఖ్య అతిథిలుగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి,కేకే కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కల్వ సుజాత గుప్త మాట్లాడుతూ ప్రజాసేవలో సత్యమన్న మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. బాలానగర్ డివిజన్ డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షులు మల్లికార్జున్ యాదవ్, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శేఖర్ గజానంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల మహేష్ గౌడ్, సుంకన్న, ఇమ్ము, నరేష్ ఆధ్వర్యంలలో కేక్ లు కట్ చేసి, పండ్లు పంపిణి చేసి, స్వీట్లు పంచి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో విజయ దుర్గ సెంటర్‌లో పారిశుద్ధ కార్మికులకు చీరల పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, సీనియర్ మహిళా నాయకురాలు స్వరూప గౌడ్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, డివిజన్‌ల మహిళా అధ్యక్షురాళ్లు గుండ జ్యోతి, విజయ లక్ష్మి, మారుతీ, పొన్నం రజిత, జోజమ్మ, భారతమ్మ, ఏఎంసీ డైరెక్టర్ ఫణి కుమార్, అరుణ్ గౌడ్, సృంజిత్ గౌడ్, కనకయ్య ముదిరాజ్, పవన్ గాండ్ల, ఆదిత్య, సంధ్య, ప్రణతి, అరవింద, నరేష్, వెంకటేష్, యుగేందర్, సాగర్, శ్రీశైలం, శంకర్, ఖలీమ్, విశాల్, నవీన్, ప్రశాంత్, లడ్డు, సాయి, పద్మ, శ్వేతా, జల్ల శివ, ప్రభాకర్, మల్లేష్, అమీర్, పాల్, రమేష్ గుప్త, శ్రీకాంత్, కనకరాజు యాదవ్, అరవింద్ గౌడ్, వెంకీ, శ్రీనివాస్, ఖేరా సింగ్, జ్యోతి, శ్రీను, కలికోట మహేష్, గోవింద్, పవన్, పారిశుద్ధ కార్మికులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ సోదరులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# విత్తనాలు నాటే విజంగ్ మొహతుక్ పూజ కార్యక్రమం

ఆదిలాబాద్ జిల్లా, నార్నూర్ మండలం, జూన్ 05(జనసంఘర్షణ ):



నార్నూర్ మండలంలోని ఏంపల్లి గ్రామంలో శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉమ్మడి నార్నూర్ మండలం లో ఏంపల్లి గొండుగూడా ఆదివాసులు సంప్రదాయం పూజలు వర్షలు సమృద్ధిగా కురవాలని పంట దిగుబడులు బాగా పండాలని ఆదివాసీ గిరిజనులు భక్తి శ్రద్ధలతో విత్తనాలా నాటే కార్యక్రమం విజంగ్ మేహుతురు పూజలు నిర్వహించారు. ఏంపల్లి పంచాయతీ పరిధిలో నీ గోండుగుడాలో సంప్రదాయ నృత్యాలు చేశారు. వేడుకలు ఘనగా నిర్వహించడం అనంతరం వ్యవసాయ పనులకు శ్రీ కారం చుట్టానున్నాట్లు విత్తనాలు విత్తనున్నాట్లు గ్రామం పెద్దలు తెలపారు, గ్రామం పెద్దలు పెందోర్ అమృతరావు పటేల్ కోట్నాక్ శ్రీరామ్ పెందోర్ జోతిరం పూసం జాంబిరావు మాడవి జల్పత్ కొట్నాక్ భీంరావ్ పూసం లచ్చు పూసం కారును మాడవి యందొరావు, పెందోర్ కలబాయి సేద్మకి లచ్చుబాయి పెందోర్ దృపాతబాయి పుల్లమ్మ పూసం పారుబాయి, గ్రామ ప్రజలు ఉన్నారు.

# శంకరరాజుపల్లి మహిళలు యువతులతో ముఖాముఖి

- బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న

ములుగు జిల్లా, ఎటూరునాగారం మండలం, జూన్ 05(జనసంఘర్షణ ):



ఎటూరు నాగారం మండలం,శంకర రాజుపల్లి గ్రామ యువతులతో, చదువుతున్న విద్యార్థినులతో మాట్లాడుతూ, ఆడబిడ్డల మీద జరుగుతున్న అఘాయిత్యాలను గురించి వివరిస్తూ వాటి నుంచి ఎలా తప్పించుకోవాలో సూచించారు. యువతులు సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు గ్రహిస్తూ అప్రమత్తంగా ఉండాలని మన జాగ్రత్తలో మనం ఉండాలని ఎవరిని కూడా గుడ్డిగా నమ్మకూడదని ఒక అన్నయ్యగా సూచించారు. ఆడబిడ్డలు సంప్రదాయమైన దుస్తులు వేసుకోవాలని సోషల్ మీడియాలో ఫేస్బుక్ కావొచ్చు ఇంస్టాగ్రామ్ ,కావచ్చు తెలియని వ్యక్తులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ చేయవద్దని తెలియని వ్యక్తులకు ఫాలో చేయవద్దని వారు చెప్పే మాయమాటలకు మోసపోకూడదని సూచించారు. అనుకొని సమయంలో ఎటువంటి ఆపద వచ్చినా ఒక అన్నయ్యగా మీకు తోడు ఉంటానని హామీ ఇచ్చారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోవాలని. మీ తల్లిదండ్రులకు మనకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో నేర్పించాల్సిన బాధ్యత చదువుకున్న వ్యక్తిగా మీ మీదనే ఆధారపడి ఉందని ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఎవరు ఇలాంటి వాళ్ళు ఎవరు ఏం చేస్తున్నారు, అనేది మీ తల్లిదండ్రులకు సమయం దొరికినప్పుడు వారికి వివరించాల్సిన బాధ్యత మన మీద ఎంతో ఉందని కోరారు. మహిళలు అన్ని రంగాలలో విద్యా వైద్యం ఉపాధి వ్యాపారం రాజకీయ రంగాలలో ముందుకు సాగాలని సూచించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ పర్యటనను జయప్రదం చేయండి

- పిలుపునిచ్చిన టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 05, (జన సంఘర్షణ):



జూన్ నెల 8వ తేదీ సాయంత్రం 5:00 గంటలకు మియాపూర్‌లో రూ.161 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజతో పాటు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బండి రమేష్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం మియాపూర్‌లోని స్థలాన్ని పరిశీలించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపుడి గాంధీ, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్ల నర్సింహా రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి కోలన్ హనుమంత్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్,టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# ఘనంగా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్.

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 05, (జన సంఘర్షణ) :




సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య జన్మదిన కార్యక్రమాలు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ హేమ దుర్గాభవన్లో జరిగాయి. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని లక్ష్మయ్య చేత కేక్ కటింగ్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులకు సముచిత గౌరవం ఉంటుందని, వారికి మంచి పదవుల లభించే లాగా తన వంతు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు నాయకులకు మంచి పదవులు లభిస్తాయి అని పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాయిబాబా చౌదరి, ధర్మ రావు, మస్తాన్ రెడ్డి, కనకయ్య, పిడికిటి గోపాల్ చౌదరి, కామినేని వాసు, మేకల మహేష్, నసీర్, మోహన్ నాయక్, బండి సుధా, సంధ్య, కల్పన, అపర్ణ, జయలక్ష్మి, రాజేశ్వరి, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, దానలక్ష్మి,రజని, నాగమణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుంపెల్లగూడెం గ్రామ పంచాయతీ రికార్డు తనిఖీ చేసిన యంపిఓ మండల అధికారి....



గుంపెల్లగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీకి సంబంధించిన వివిధ రికార్డులు, రిజిస్టర్లు, పరిపాలనా పత్రాలను సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. పంచాయతీ పరిపాలనలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణ, ప్రభుత్వ నిబంధనల అమలును నిర్ధారించే ఉద్దేశ్యంతో ఈ తనిఖీ చేపట్టబడింది. తనిఖీ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణ, అభివృద్ధి పనుల వివరాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఇతర పరిపాలనా రికార్డులను పరిశీలించడం జరిగింది. అధికారులు అవసరమైన సూచనలు అందించి, రికార్డులను మరింత మెరుగ్గా నిర్వహించాలని సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి, సమర్థవంతమైన పరిపాలన కోసం ఇలాంటి తనిఖీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు.

## వాడబలిజ కార్పొరేషన్ దిశగా మన గమ్యం



నలుదిక్కులూ కానరాని జలనిధి లో
ఎన్నో సుడిగుండాలు...ప్రశాంత జలజీవన పోకడలు!
ఆద్యంతం తరంగాల విలయతాండవం!
తెడ్డు చేబట్టి అగాధ జలనిధిలో...
అంధకార బంధురమై తీరానికి దారి వెతికే
గజ ఈత గాళ్ళు ఆక్రందనల ఘోష!
బ్రతుకు భారమై దిక్కు తోచని జీవనాధారం
కనులముందే కనుమరుగైతే,
కనురెప్పలు...చెమ్మగిల్లాయి
గుండె బరువైంది దిక్కుతోచని వైనం!
బ్రతుకే అగమ్య గోచరం!!
వీధిలో...కేక వినిపించదు బయటకు
తనకు తాను అరుస్తుంటే అధి పిచ్చోడి పేలాపన!
నడిరోడ్డున...ఎలుగెత్తి చాటితే అదీ..జన సంద్రం ఘోష!
అందరూ..ఒక్కటై వేల గొంతులు కలసి
నలుదిక్కులూ.. పిక్కటిల్లేలా...అరిస్తే!
అది కాదా... వాడబలిజల ఆక్రందన, మరణ మృదంగాల.. హేల!
తర తరాల తీరం జీవన సౌలభ్యం! తెలంగాణా... నేపథ్యం!!
తెరల మాటున సగటు మనిషి జీవితం
అణగారిపోతున్న వైనం! కుల వివక్షతకు నిదర్శనం!!
రండి! రండి!! ఎన్నాళ్ళని..ఈ ఎదురు చూపు!
ఏన్నేళ్లని...ఈ నిరీక్షణ! తర తరాలు మారుతున్నా..
తీరం! రూపురేఖలు కళా విహీనమై ...
తాబేళ్ల... కళేబరాలతో శ్మశాన వాటికను... తలపిస్తుంది!
జన సంచారం లేక సముద్ర కెరటాల హోరు! అరణ్య రోదనలకు
భయకంపితలవుతున్న తీర ప్రాంతాలు!
ఎత్తైన వెండి వెన్నెల ఇసుక తిన్నెలు, సువిశాల పరివాహక ప్రాంతం!
పండు వెన్నెల... పరిణమిల్లి నట్లుండే ఆ..కళా కాంతులేమైనట్టు!
నిత్యం...ఎగసిపడే జలరాసుల కోలా..హలం! రసాయనాల రక్కసి
కోరల్లో రగిలిపోతూ... ఉషోదయ వేళ ఊసురో మంటూ...
ఎగసిపడే తరంగాలు నిస్సత్తువతో దిగజారుతూ.... జాలువారే తెరలు!
నిత్యం! జన సంచారం వేట గాళ్ళు సందడి తో
మత్స్య శ్రామికుల ఆవాసాలు.. సముద్ర తీరాలు!
ధరణికి తోడు ఆ...గంగమ్మ తల్లి! ఎల్లవేళలా కాపుకాస్తూ.. సంరక్షిస్తుందటే...
ప్రాణాలను పణంగా పెట్టి బ్రతుకు తెరువుకు...
బాసటగా నిలచి దిన దిన గండంగా మనోధైర్యాన్ని మొండిగా
మలచుకుని జీవన నైరాశ్యంలో.. కాలం వెళ్లదీస్తున్న అభాగ్యులెందరో...
ముత్యమల్లె తెల్లదనం కెరటాలు పొంగులువారే...
నురగ నిచ్చెలిలు! చేతిలోన నురగతో వెన్నముద్దను పోలి గాలిలోన...
దోభూచుల, సయ్యాటలు! ముచ్చటించే మలుపు
వలపు వయ్యారాలు తరంగాల తిమిరాలకు తిలోదకాలు!
ఏది ఏమైనా... మనమంతా వాడబలిజ సామాజిక వర్గానికి చెందిన వాళ్ళం.
బ్రతుకు తెరువుకై మనం ఎక్కడవున్నా...సమస్యన్నది
అందరికీ చెందినదే, ఇటువంటి
విషయంలో...మనమందరం ఏకతాటిపైకి వచ్చి సమస్యను తీర్చగలవారమై ఉండాలి.
అంటే మనలో...ఐక్యత కలిగి ఉండడమన్నది ముఖ్యం!
ఈ ఐక్యతే లేకపోతే, మన మందరం కలిసేది ఎట్లా..?అంటే...మనకు
కులం బలం గొప్పది! మనం బ్రతికే దారులు వేరైనా...
మనం కలిసుండే తీరు తెన్నులు ఒకటే!
మన ఆశయం ఒకటే మన లక్ష్యం ఒకటే
మన గమ్యం ఒకటే మనం అనుసరించవలసిన
విధి విధానాలు...ఒక్కటే! అందుకనే, మనమంతా
సంగటితమయ్యే సమయం ఆసన్నమయిందని చెప్పవల సిన అవసరం వచ్చింది!
సోదరులారా...! ఇకనైనా... మేల్కొండి!
సర్వ సామాజిక, నైసర్గిక స్వరూపాన్ని ఎరిగినటువంటి వాళ్ళం!
మనం ఏఒక్కరికీ తక్కువ కాదు, దేన్నైనా సాసించగల
సత్తా ఉన్న వాళ్ళం! కానీ...మనమంతా ఒకరి నొకరు అర్థం చేసుకుని
చేయి, చేయూ కలుపుకుని, ముందుకు పో...గలిగితే!
మనం అనుకున్నది సాధించడం పెద్ద కష్ట తరమేమీ కాదు!
అందుకని ఒకప్పుడు సమైక్యాంధ్రగా కలిసుండే తెలంగాణా ...ఆంధ్రప్రదేశ్
వాడబలిజ సోదర సోదరీ మణులను సంఘటితం చేసే గురుతరమైన బాధ్యత ఉంది.
ఈనేపథ్యంలో...మన సామాజిక వర్గానికి చెందిన హక్కుల సాధన కొరకూ...
మనమందరం ఏకమై వాడబలిజ ఔనత్యాన్ని ఉనికినీ విశిష్టత ఐక్యతనూ..
పరిరక్షించుకునే బాధ్యత ఎంతైనా ఉంది.త్వరలోనే...జిల్లాల వారీగా
ముఖ్యంగా! కుల నాయకులను కలసి, “వాడబలిజ కార్పొరేషన్”
సాధించి గట్టి నిర్ణయం తీసుకోవాలనీ మనమంతా..
ఒక ధృడ నిశ్చయానికి రావడానికి చేసే ప్రయత్నంలో... మీరూ ఒకరిగా మాతో పయనించ వలసిందిగా...సవినయంగా కోరుతూ....

**మీశ్రేయోభిలాషి::**
**మైలపల్లి నాగరాజు విశాఖపట్నం 9966876796**

## కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ..



పోతంగల్/జూన్ 5/(జన సంఘర్షణ)
కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోతంగల్ మండలం ఓల్డ్ పోతంగల్ గ్రామంలో క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓల్డ్ పోతంగల్ గ్రామం లో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతలో కి్రడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెరగడానికి క్రీడలు దోహదపడతాయని కటిక రామరాజు పేర్కొన్నారు క్రికెట్ కిట్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ బృందం, పబ్బ శేఖర్ ఏముల నవీన్, పత్తి సతీష్, సీతారాం నాయక్, ఆలపాటి హరికృష్ణ, మరియు పోతంగల్ క్రికెట్ టీమ్ సుదం శ్రవణ్, అఖిల్, ప్రవీణ్, సందీప్, సంపత్, నవీన్, గిరి, సంజు, శ్రీహరి, ప్రదీప్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి శేరిలింగంపల్లిలో భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి

◆ **టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్.**

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 05, (జన సంఘర్షణ):
తెలంగాణను కేవలం అభివృద్ధి చెందిన రాష్ట్రంగా కాకుండా, ప్రపంచం వైపు చూసే రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే దూరదృష్టితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఫ్యూచర్ సిటీ, రేడియల్ రోడ్లు, రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జూన్ 8వ తేదీ శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి శ్రీకారం చుట్టేవిదంగా మియాపూర్ మెట్రో నందు నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ వేదిక ఏర్పాట్లను డిసిసి అధ్యక్షులు చైర్మన్ చెల్లా నర్సింహ రెడ్డి,మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ , శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ, కూకట్పల్లి ఇంచార్జ్ బండి రమేష్ ,కుత్బులాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులతో కలిసి వి. జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృక్పథం అభివృద్ధి ఫలాలు తెలంగాణలోని ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరేలా చేయడమే వారి లక్ష్యం అనే భావనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తున్నారని, మౌలికసదుపాయాలు, పెట్టుబడులు,



విద్య, వైద్యం, పారిశ్రామికీకరణ, సాగునీరు, సంక్షేమ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి అభివృద్ధి పనులకోసం విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల సభను విజయవంతం చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజానీకానికి పిలుపునిచ్చారు..

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు మొక్కలు నాటిన గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్

హైదరాబాద్ సిటీ ప్రతినిధి అంజిబాబు, జూన్ 05, (జన సంఘర్షణ):
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఒక మొక్క అమ్మ పేరుతో కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, మన ప్రియతమ గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఒక మొక్క అమ్మ పేరుతో (ఎక్ పెడ్ మా కె నామ్) గాంధీనగర్ డివిజన్ లోని కెనరా బ్యాంక్ పార్క్ లో డివిజన్ బిజెపి అధ్యక్షుడు వి.నవీన్ కుమార్ ఆధ్వర్యంలోలి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బిజెపి సికింద్రబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భారత్ గౌడ్ గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ





సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుదాం అన్నారు.మన ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మనకు జన్మనిచ్చిన తల్లినీ, మనల్ని భారాన్ని మోస్తూ, పోషిస్తున్న భూమాతను గౌరవిస్తూ, అమ్మ పేరుతో ఒక మొక్క నినాదంతో మొక్కలు నాటాలన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడు కోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. భూ మండలంపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు, వర్షాలు పడేందుకు, విపత్తుల సమయంలో చెట్లు ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు మాజీ కార్పొరేటర్. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్,కార్యక్రమం కన్వీనర్ రామ్ రెడ్డి, డివిజన్ సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, రాజు, ఎం.ఉమేష్, బాల కృష్ణ,పాల శ్రీనివాస్, సత్తిరెడ్డి, మహమూద్, ప్రకాష్ యాదవ్, శివ కుమార్, ఆనంద్ రావు, లక్ష్మణ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, జ్ఞానేశ్వర్, జి. డి.రాజు, సంయుక్త రాణి తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి 2025- 2026 సీజన్లో జొన్నలు, మొక్కజొన్నలు మద్దతు ధరపై సమీక్ష

◆ **జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

కామారెడ్డి /జూన్ 5/(జన సంఘర్షణ)
యాసంగి 2025-26 సీజన్లో జొన్నలు (జోవార్), మొక్కజొన్న (మైజ్) కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం తన ఛాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష లో అదనపు కలెక్టర్ విక్టర్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ), జిల్లా సహకార అధికారి (డీసీఓ), ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోళ్ల పురోగతిని సమీక్షించి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి మూడు రోజుల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే జొన్నల కొనుగోళ్లను కూడా వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, తూకం, రవాణా, నిల్వ ప్రక్రియలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో గోదాములకు తరలించి నిల్వ చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 39,903 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న, 20,718 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేయడం జరిగిందని జొన్నలు, మొక్కజొన్న కొనుగోళ్లకు అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించి తగిన నిల్వ సదుపాయాలను



సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు కనీస మద్దతు ధర ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# కామారెడ్డి జిల్లాలో విషాదం

◆ **బోల్లక్ పల్లి మంజీరా నదిలో అయిదుగురు గల్లంతు**
◆ **ముగ్గురి మృతదేహాలు లభ్యం**
◆ **మరో ఇద్దరిని కాపాడిన బంధువులు**

కామారెడ్డి /జూన్ 5/(జన సంఘర్షణ)



కామారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది.మంజీరా పరివాహక ప్రాంతంలో ఎల్లమ్మ తల్లి వేడుకల కోసం వచ్చిన బంధువులలో ఐదుగురు మంజీర నదిలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యారు. వీరిలో ముగ్గురు మృతదేహాలను వెలికి తీసిన ఈతగాళ్లు మరో ఇద్దరిని రక్షించిన బంధువులు. వివరాల్లోకి వెళితే పిట్లం మండలం మంగళ్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన వారు మంజీరా ప్రాంతంలో ఎల్లమ్మ తల్లి వేడుకల కోసం వచ్చి కనిపించని లోకానికి వెళ్లిపోవడంతో, మృతుల కుటుంబ సభ్యుల రోదనలతో బాన్సువాడ ఆసుపత్రి దద్దరిల్లింది. మంజీరా పరివాహక ప్రాంతంలో ఎల్లమ్మ తల్లి వేడుక





చేసుకున్న తర్వాత, మంజీరా నదిలో స్నానానికి దిగిన ముగ్గురు ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు మృతులు తల్లి అనిత (40) కుమార్తె శివాని(,13) పావని ( 14) ముగ్గురు మృతదేహాలను బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన మరో బాలుడు భాను ప్రసాద్ ను కాపాడి ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన సుశాంత్ ను బంధువులు రక్షించారు. ఐదుగురు గల్లంతు కాగా ముగ్గురు జల సమాధి అయ్యారు. మరో ఇద్దరిని బంధువులు కాపాడారు. ఈ ఘటన పట్ల కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. తల్లితోపాటు ఇద్దరు పిల్లలు మంజీర నదిలో పడి జల సమాధి కావడంతో వారి కుటుంబ సభ్యుల రోదన పలువురిని కలచివేసింది. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

# సాగు తాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి పక్క ప్రణాళికతో ముందుకు వెళ్లాలి

◆ **రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి**

మహబూబ్‌నగర్/జూన్ 5/(జన సంఘర్షణ)

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో చేపట్టిన సాగు, తాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో 26 లక్షల ఎకరాలకు నీరందించి జిల్లాను సస్యశ్యామలం చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని గత రెండు రోజులుగా ప్రధాన నీటి పారుదల ప్రాజెక్టుల్లో కొనసాగుతున్న పనులను ముఖ్యమంత్రి మంత్రులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిశీలించారు. అనంతరం ఆయన కొత్తూరు కరివెన రిజర్వాయర్ వద్ద మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు , వాకిటి శ్రీహరి తో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాకు 90 టీఎంసీల నీటిని అందించగలిగితే అత్యంత కీలకమైన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. జిల్లాకు చెందిన పాలమూరుతో పాటు కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, జూరాల, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉండేదని వివరించారు. "ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రధానమైన భూసేకరణ చేయకుండా గత ప్రభుత్వ హయాంలో నిధులను పంపులు, లిఫ్ట్‌లకే ఖర్చు చేశారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో రూ. 84,503 కోట్ల అప్పు చేస్తే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 30 నెలల్లో అసలు, వడ్డీ కలిపి రూ. 52,121 కోట్లు చెల్లించా" చెప్పారు. అప్పులు, వడ్డీ పోగా కొత్తగా ప్రాజెక్టుల కోసం రూ. 22 వేల కోట్లు ఖర్చు చేయగా అందులో రూ. 8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల కోసం ఖర్చు పెట్టామని, ఈ లెక్కన జిల్లాలోని ప్రాజెక్టులకు ఎక్కువ ఖర్చు చేసినట్టా తక్కువ ఖర్చు చేసినట్టా అని ప్రశ్నించారు. రాబోయే రెండేండ్లలో గరిష్టస్థాయిలో ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి ఇకనుంచి విడతల వారిగా ఒక ప్రణాళికా బద్ధంగా పనులను పూర్తి చేయాలన్న ఆలోచనతో ఉన్నాం. భూ సేకరణ పూర్తి కాకుండా ప్రాజెక్టులు ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ప్రధానంగా మరో 4 వేల ఎకరాల భూ సేకరణ జరగాల్సి ఉందని పేర్కొంటూ అవసరమైన నిధులను విడుదల చేస్తామన్నారు. రైతులు అడుగుతున్న ధరలో కొంత ఎక్కువైనప్పటికీ భూసేకరణ పనులను పూర్తి చేస్తామని చెప్పారు. "ఇప్పుడు పనులు పూర్తి చేయకపోతే చరిత్ర క్షమించదు. జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేయడానికి నీళ్లు నింపడానికి రిజర్వాయర్లు కూడా పూర్తి కావాలి. రిజర్వాయర్లకు సంబంధించి ఆగిపోయిన పనులను కూడా పునరుద్ధరించాల్సి ఉంది. రాబోయే రోజుల్లో ఎక్కడికక్కడ నీళ్లు నిలువ చేయడానికి అవసరమైన పనులను పూర్తి చేస్తాం" అని తెలిపారు. కర్నాటక రాష్ట్ర సరిహద్దు వద్ద బ్రిడ్జ్ కమ్ బ్యారేజీ కట్టుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని చెబుతున్నారని, ఈ విషయంలో తొందర్లోనే సాంకేతిక నిపుణులతో చర్చించి కర్నాటక ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని ముందుకు వెళతామని అన్నారు. "పెండింగ్ పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసుకుని వాటిని పూర్తి చేయడానికి అవసరమైన కార్యాచరణ రూపొందిస్తాం. జిల్లాను అభివృద్ధి చేసుకుందాం. ఆలోచనా విధానంలో వేర్వేరు దృక్పథాలు ఉండొచ్చు. కానీ జిల్లా అభివృద్ధి విషయంలో అంతా ఒక్కటిగా ఉండాలి" అని కోరారు. "పాలమూరు - రంగారెడ్డి నుంచి ఉద్దండాపూర్ వరకు ఉన్న అడ్డంకులు ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ రావాలి. ఇప్పుడున్న పంపులు, లిఫ్ట్‌లు, కెనాల్లు పూర్తి స్థాయిలో 2027 నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నాం. అక్కడి నుంచి లక్ష్మీదేవిపూర్ వరకు నీటిని తరలించే విషయంపై వచ్చే 6 నెలల్లో మరోసారి సమీక్షిస్తాం" అని పేర్కొన్నారు. "పాలమూరు ప్రాజెక్టుల పనులను పూర్తి చేయడానికి మా చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదు. నేను ప్రత్యేకించి ఈ ప్రాంతం వాడిని. నా బాధ్యతను మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తా. గడిచిన 20 ఏండ్ల చరిత్రలో ఎప్పుడూ చిన్న విషయంలో కూడా లాలూచీ పడిన సందర్భం లేదు" అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని కష్టాలు



ఎదురైనప్పటికీ అనేక అవాంతరాలను అధిగమిస్తూ 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కేవలం మద్దతు ధర ప్రకటించి వడ్లు కొనుగోలు చేయకపోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి అవసరమైన యూరియా కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని రామగుండం ఫెర్టిలైజర్స్ నుంచి ఉత్పత్తి అవుతున్న యూరియా బయటి రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారని, ఈ రాష్ట్ర అవసరాలకు కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి చెందిన నీటి హక్కులపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గోదావరి జలాల్లో 968 టీఎంసీల నికర జలాల కేటాయింపులు ఉన్నాయని, ఈ జలాల విషయంలో చుక్క నీటి విషయంలో కూడా రాజీ పడే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు. తెలంగాణకు జరిగిన కేటాయింపులు కచ్చితంగా రావలసిందేనని, 968 నికర జలాల లెక్క తేలిన తర్వాత సముద్రంలో కలుస్తున్న మిగులు జలాలపై చర్చిస్తామని అన్నారు. "వచ్చే డిసెంబర్ నాటికి కృష్ణా జలాలపై ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తాం. పరిష్కారం కోసం ఆఖరు నిమిషం వరకు పోరాడుతాం" అని స్పష్టం చేశారు. "పక్క రాష్ట్రాలతో పంచాయతీలు కోరుకోవడం లేదని, పంచాయతీ కావాలా, పరిష్కారం కావాలా అంటే నాకు పరిష్కారమే కావాలని చెబుతాను. గోదావరి, కృష్ణా జలాల్లో చుక్క నీరు వదులుకోం. చిల్లర పంచాయతీలు మాట్లాడం. వ్యూహాత్మకంగా ప్రతి చుక్క కాపాడుకునే ప్రయత్నం చేస్తాం" అని నొక్కి చెప్పారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టడానికి మహారాష్ట్రతో సంప్రదింపుల ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ విషయంపై చర్చించడానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశామని మరోసారి గుర్తుచేశారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరికీ నా నమస్కారాలు

పోతంగల్/జూన్ 5/(జనసంఘర్షణ)






ఉదయం 8-30 గంటలకు పోతంగల్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనము కొరకు భూమి పూజ గలదు. ఉదయం 10:00 గంటలకు నూతన గ్రామపంచాయతీ భవనము కొరకు భూమి పూజ గలదు. ఈ కార్యక్రమానికి మన బాన్స్వాడ శాసనసభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు, పెద్దలు పోచారం శ్రీనివాస్ రెడ్డి వారితోపాటు రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి పాల్గొనుచున్నారు. కావున కార్యక్రమానికి పోతంగల్ కోటగిరి ఉమ్మడి మండల ఏఎంసీ చైర్మన్, మాజీ జెడ్పిటిసి సభ్యులు, మాజీ ఎంపీపీలు, వివిధ గ్రామాల ఉమ్మడి మండల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, ఉమ్మడి మండలాల సొసైటీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని మీ అందరికీ పేరుపేరునా విజ్ఞప్తి. నమస్కారం జై కాంగ్రెస్ జై జై కాంగ్రెస్, ఇట్టి సమాచారము పత్రిక విలేకరులకు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులకు తగు సమాచారము కొరకు తెలుపనైనది. మీరందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మీ అందరికీ పేరుపేరునా విజ్ఞప్తి నమస్కారం. పుప్పాలశంకర్, పోతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేర్కొన్నాడు.

# రుద్రూర్‌లో టిఆర్ఎస్ పార్టీలో డమ్మీ కార్యకర్తలు లేరు

◆ **టిఆర్ఎస్ పార్టీలో నిజమైన కార్యకర్తలే ఉన్నారు**


రుద్రూర్/జూన్ 5/(జన సంఘర్షణ)



గత కొద్దిరోజుల క్రితం నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇచ్చిన సమాధానం తెలంగాణ రాష్ట్రంలో కానీ అదే విధంగా బాన్సువాడ నియోజకవర్గంలో పాటు రుద్రూరు మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీలో అందరూ నిజమైన కార్యకర్తలు ఉన్నారని డమ్మీ కార్యకర్తలు ఎవ్వరూ లేరని టిఆర్ఎస్ పార్టీ నిజమైన నాయకులు ఉన్నారు అని టిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. అయితే బాన్స్వాడ నియోజకవర్గంలో అదేవిధంగా రుద్రూర్ మండల కేంద్రంలో కొంతమంది టిఆర్ఎస్ పార్టీ నుంచి ఇతర పార్టీలో పోయిన నాయకులు వారికి సంబంధించిన కొంతమందిని టిఆర్ఎస్ పార్టీలో ఉంచి ఏమి జరుగుతుందో తెలుసుకోవడం కోసం డమ్మీ టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలుగా నియమించారు అనే అపోహలు విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ నాయకులకు ఈ విషయం వారి దృష్టికి తీసుకువెళ్లగా నిజమేనా అని ప్రశ్నించగా ఈ సమాధానం వారు ఇవ్వడం జరిగింది.

# 14 లక్షలు ఇస్తే పర్మిషన్ పక్కా విద్యాశాఖ ఉద్యోగి బంపర్ ఆఫర్!..

హైదరాబాద్/జూన్ 5/(జన సంఘర్షణ)



నిజామాబాద్: జిల్లాలోని ఓ నియోజకవర్గంలో కొత్త పాఠశాలల ఏర్పాటును ఆసరాగా చేసుకుని హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యాశాఖ ఉద్యోగి భారీ అవినీతికి తెరలేపారు. "రూ.14 లక్షలు ఇస్తే అధికారులందరినీ మేనేజ్ చేసి పర్మిషన్లు ఇప్పిస్తా" అంటూ దళారుల ద్వారా బేరసారాలకు దిగడం సర్వత్ర తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే, "మేము విద్యాబోధన చేయడానికి వస్తున్నాం తప్ప, వ్యాపారం చేయడానికి కాదు" అని స్పష్టం చేస్తూ పలు యాజమాన్యాలు ఈ దళారుల బేరసారాలను గట్టిగా తిప్పికొడుతున్నాయి. పవిత్రమైన విద్యావ్యవస్థను తమ స్వార్థం కోసం కలుషితం చేస్తూ అడ్డదారిలో డబ్బులు దండుకుంటున్న ఇలాంటి అవినీతి ఉద్యోగిపై ప్రభుత్వం తక్షణమే ఉక్కుపాదం మోపాలని విద్యార్థి, ప్రజా సంఘాలు తీవ్ర స్థాయిలో డిమాండ్ చేస్తున్నాయి.

# విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

బీర్కూర్./జూన్ 5/(జన సంఘర్షణ)



బీర్కూరు మండలం ఇందిర కాలనికి చెందిన బాస పెద్ద సాయిలు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఇంట్లో వేలాడుతున్న విద్యుత్ తీగ తగిలి ఆకస్మికంగా కరెంట్ షాకుకు గురై మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుయ్యారు. ఘటన స్థలానికి చేరుకున్న సర్పంచ్, పోలీసులు, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

# రైతులకు నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించాలి

కామారెడ్డి /జూన్ 5/(జన సంఘర్షణ)



అకాల వర్షాల కారణంగా ఈ నెల 5వ తేదీ వరకు పూర్తికావలసిన కొనుగోలు ప్రక్రియ 10వ తేదీలోగా కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి డివిజన్‌లో గురువారం కురిసిన భారీ వర్షాల కారణంగా సుమారు 800 మెట్రిక్ టన్నుల వరి తడిసిపోవడంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం అదనపు కలెక్టర్ విక్టర్ తో కలిసి రామేశ్వర్‌పల్లి ప్యాడీ పర్చేజ్ సెంటర్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు ధాన్యం తరలింపులో జాప్యం జరగకుండా తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసి తడిసిన వరిని అత్యవసరంగా రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డిసిఓ రామ్మోహన్ రావు, సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సిద్ధిరామేశ్వర రైస్ మిల్లులో ఆరు పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. తడిసిన వరిని వెంటనే అన్‌లోడ్ చేసి స్వీకరించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తి సహకారం అందించాలని సూచించారు. తమ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని అన్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన 14 మంది రైస్ మిల్లర్ల పై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియకు సహకరించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని, ప్రస్తుత తేదీ నాటికి జిల్లాలో మొత్తం 4,19,000 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి సకాలంలో తరలించేందుకు అన్ని చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమ్మెకు దిగిన ప్రభుత్వ వైద్యుల సంఘం

◆ **గాంధీ ఆసుపత్రి ముందు వైద్యుల నిరసన**

హైదరాబాద్/జూన్ 5/(జన సంఘర్షణ)



వైద్యుల బదిలీ ప్రక్రియను వెతికిస్తూ ప్రభుత్వ వైద్యుల సంఘం శుక్రవారం బందుకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సమ్మెకు దిగిన తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు, వైద్యులు. ఓపి సేవలకు దూరంగా ఉన్న ప్రభుత్వ వైద్యులు. వైద్యుల బదిలీలు జీవో 38 ప్రకారం జరగడం లేదని వైద్యులు మండిపడ్డారు. తమ డిమాండ్ల సాధన కోసం ప్రస్తుతానికి ఓపి సేవలకు దూరంగా ఉన్నామని ప్రభుత్వం స్పందించకుంటే విధులను బహిష్కరిస్తామని ప్రభుత్వ వైద్యుల సంఘం వెల్లడించింది.

# నీటి నిల్వ చెరువును (ఇంకుడుగుంత) ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి /జూన్ 5/(జన సంఘర్షణ)



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా ఐడిఓసి ప్రాంగణంలో నిధుల ద్వారా నిర్మించిన నీటి నిల్వ చెరువును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు , పర్యావరణ పరిరక్షణకు నీటి నిల్వ చెరువులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వర్షపు నీటిని సద్వినియోగం చేసేందుకు ఇటువంటి చర్యలు చేపట్టడం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నిధుల నుంచి రూ. 6.55 లక్షల వ్యయంతో ఈ నీటి నిల్వ చెరువును నిర్మించినట్లు తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు ఇది ఉపయోగపడుతుందని కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. చెరువు చుట్టూ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేయడం ద్వారా కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దితే భవిష్యత్తులో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలను కూడా ఇక్కడ నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి అదనపు కలెక్టర్ ఎన్ వి గిరి, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# తన భార్యతో ఓ ఎస్సై వివాహేతర సంబంధం?

- తనకు న్యాయం చేయండి.. మహిళ భర్త సెల్ఫ్ వీడియోలో మొర
- బాన్సువాడ నియోజకవర్గంలో ఉమ్మడి మండలాల్లో షాడో ఎస్సై అంతా నా ఇష్టం లీడర్లు నా వెనుక ఉన్నారు..
- నేను ఏం చెప్పితే అది నడుస్తది నేను ఏం చేస్తే అది తప్పు కాదు అదే కరెక్ట్ ఎస్సై స్టైల్ వేరు..
- మా లీడర్ ఎవరిపై చెప్తే వారిపై కేసులు చేస్తాం రౌడీ షీట్ చేస్తా అనే చందంగా మారింది ఆ షాడో ఎస్సై ది..
- షాడో ఎస్సై ఆగడాలు చాలా ఉన్నాయి రాత్రి అయితే మద్యం మందు తాగి తందానే ఎస్సై..






నిజామాబాద్ బ్యూరో /జూన్ 5/(జన సంఘర్షణ)

చట్టాన్ని కాపాడవలసిన ఓ పోలీస్ అధికారి, అదే పోలీస్ స్టేషన్లో కిందిస్థాయి ఉద్యోగం చేస్తున్న ఉద్యోగి, భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు ఏకంగా ఆ మహిళా భర్త సెల్ఫీ వీడియోలో తన ఆవేదన వ్యక్తపరిచారు. బోధన్ పోలీస్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్లో ఇటీవల బదిలీ అయిన ఎస్సై పై కిందిస్థాయి ఉద్యోగి తనకు నాన ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయండి అంటూ ఉన్నత అధికారులకు మొరపెట్టుకున్నారు, లేకుంటే తాను ఆత్మహత్య చేసుకుంటారని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లో చిన్న ఉద్యోగం చేస్తున్న వ్యక్తి తన భార్యతో గొడవ పడగా ఈ గొడవ పోలీస్టేషన్ వరకు వెళ్ళింది ,పోలీస్ స్టేషన్కు భార్యాభర్తలు వెళ్ళగా,, ఆ ఉద్యోగి భార్యపై ఎస్సై కన్ను పడ్డది. ఇంకేముంది కిందిస్థాయి ఉద్యోగి అయిన ఆ వ్యక్తిని నానా ఇబ్బందులకు గురి చేస్తూ స్థానికంగా విధులు ఇవ్వకుండా, దూర ప్రాంతాలకు విధులకు పంపిస్తూ తన భార్యతో వివాహతర సంబంధం సాగిస్తున్నాడని ఆయన కంటతడి పెట్టారు. ఈ వీడియో ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆ ఎస్సై బాగోతం బయటపడింది. ఏకంగా ఒక భర్త, తన భార్యను ఎస్సై వివాహేతర సంబంధం సాగిస్తున్నారని ఆరోపించడం పోలీస్ శాఖలో కలకలం మొదలైంది. ఈ అధికారి బాన్స్వాడ పోలీస్ డివిజన్ పరిధిలో ఉద్యోగం చేస్తున్నప్పుడు కూడా ఓ మహిళతో అక్రమ సంబంధం కొనసాగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ చెడు బుద్ధులు ఆ ఎస్సై కి ఎటు పోతాయి అదే పద్ధతి ఇక్కడ కూడా కొనసాగించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే మహిళల పట్ల మర్యాదగా మెల్లగావలసి ఉండగా వారిపై కన్నేస్తున్నారు. తనకు న్యాయం చేస్తారని పోలీస్ స్టేషన్ కు వెళ్తే తన భార్యపైనే కన్నేశాడని ఎస్సై పనితీరుపై మండిపడ్డారు. తనతో వెట్టి చాకిరి చేయించుకునేవాడని, బట్టలు ఉతకడం, రాత్రి తిన్న ఎంగిలి ప్లేట్లు కడగడం, కాళ్లు చేతులు మాలిష్ చేయడం లాంటి పనులు చేయించుకుంటూ మూడు నెలలు తనకు నరకం చూపించాడని ఆయన వెల్లడించారు. ఇప్పటికైనా ఆ ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలంటూ ఆ చిరుద్యోగి ఉన్నతాధికారులకు కోరుతున్నారు.

# ప్రజల ఆస్తులు ప్రాణాలు కాపాడటమే పోలీసుల బాధ్యత

- పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం సిపి....

నిజామాబాద్,/ జూన్ 5/(జన సంఘర్షణ)

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ఆస్తులు ప్రాణాలు కాపాడటమే పోలీస్ శాఖ బాధ్యతని పోలీస్ కమిషనర్ శ్రీ సాయి చైతన్య స్పష్టం చేశారు.శుక్రవారం పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో రాబోయే రోజులలో మాన్సూన్ సీజన్ను దృష్టిలో ఉంచుకొని భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, చెరువులు వాగులు పొంగిపొర్లడం, రహదారులు దెబ్బతినడం, చెట్లు విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీస్ శాఖ చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానంపై పోలీస్ కమిషనర్ సాయి చైతన్య కమిషనరేట్ పరిధిలోని అధికారులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల ప్రాణాలు,ఆస్తుల రక్షణే పోలీస్ శాఖ యొక్క ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వరదలకు గురయ్యే లోతట్టు ప్రాంతాలు, ప్రమాదకర వంతెనలు, వాగులు, చెరువులు, కాలువలు, జలాశయాలు, పురాతన ఇండ్లు విరిగిపడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.భారీ వర్షాలు కురిసే సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలిగే ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని, వరద నీటిలో ప్రజలు, వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్లో ప్రత్యేక రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని, లైఫ్ జాకెట్లు, రోపులు, టార్చిలైట్లు , పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, కమ్యూనికేషన్ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక , వైద్య మరియు విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు, భద్రతా సూచనలు అందించాలని తప్పుడు ప్రచారాలు మరియు వదంతులను వెంటనే ఖండిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైతే




సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని అత్యవసర సమాచారం అందిన వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.ఈ సమావేశంలో నిజామాబాదు, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, మల్లేష్, సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ అంజయ్య, పి.సి.ఆర్ ఇన్స్పెక్టర్ వీరయ్య, సీఐలు, ఎస్. హెచ్. ఓ లు, ఐటీ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాలీమర్ కరెన్సీ నోట్లు.. ఆర్బీఐ కీలక ప్రకటన

జైపూర్/జూన్ 5/(జన సంఘర్షణ)




పాలీమర్ కరెన్సీ నోట్లపై ఆర్బీఐ కీలక ప్రకటన చేసింది. ఈ నోట్లను చలామణిలోకి తెచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. అయితే ఈ ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని చెప్పారు. కాగితపు కరెన్సీకి ఉన్న గిరాకీ నేపథ్యంలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ముద్రించాలన్న ఆలోచనను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పదేళ్ల క్రితమే ప్రతిపాదించింది. కాగితపు కరెన్సీని ముద్రించడానికి అయ్యే వ్యయం, నోట్లు చేతులు మారే క్రమంలో అవి పాడైపోవడం వంటి వాటిని దృష్టిలోఉంచుకొని అప్పట్లో ఆర్బీఐ ప్రతిపాదన చేసింది. దేశవ్యాప్తంగా ట్రయల్ పద్ధతిలో రూ.10 విలువైన ఒక బిలియన్ ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ సమయంలో పార్లమెంట్కు కేంద్రం తెలియజేసింది. అందుకు కొచ్చి, మైసూర్, జైపూర్, శిమ్లా నగరాలను ఎంచుకుంది. మరోవైపు.. మార్కెట్లో నకిలీ నోట్ల చలామణి స్వల్పంగా పెరగడంతో, వాటిని అరికట్టేందుకు, నోట్ల మన్నికను పెంచేందుకు ఆర్బీఐ నోట్లలో కొత్త సెక్యూరిటీ ఫీచర్లతో పాటు, వార్నిష్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల వెల్లడైన వార్షిక నివేదికలో ఆర్బీఐ ఈ విషయాన్ని ప్రస్తావించింది. పలుచని, రక్షిత అల్ట్రా వయొలెట్ క్యూర్డ్ వార్నిష్ పూత పూసిన కాగితపు నోట్లనే వార్నిష్ కరెన్సీగా పిలుస్తారు. సాధారణ నోట్లతో పోలిస్తే, ఇవి 2-3 రెట్లు అధిక కాలం మన్నుతాయన్నది అంచనా.

## ఘోరం.. ఎడారిలో నీళ్లు దొరక్క 49 మంది మృతి

నైజర్ దేశం/ జున్5/( జన సంఘర్షణ)



నైజర్ దేశంలోని సహారా ఎడారిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ లారీ ఎడారి మధ్యలో చెడిపోవడంతో 3 రోజులపాటు తాగడానికి నీరు దొరక్క 49 మంది దుర్మరణం పాలయ్యారు. వీరంతా ఓ పండుగ కోసం మాలి దేశానికి వెళ్లి తిరిగివస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఇద్దరు మాత్రం దాదాపు 80ఎఎ నడిచి ఓ పట్టణానికి చేరుకొని ప్రాణాలు దక్కించుకున్నారు. వారి సమాచారంతో అధికారులు అక్కడికెళ్లగా మృతదేహాలు కనిపించాయి.

## సాలూరా: చెరువు మట్టి దుర్వినియోగం?

బోధన్/జూన్ 5/(జన సంఘర్షణ)



మసాలూరా మండలంలోని చెరువులో భారీ యంత్రాలతో మట్టి తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రైతుల పొలాలకు మట్టి తరలించేందుకు ఇచ్చిన అనుమతులను కొందరు దుర్వినియోగం చేసి, వెంచర్లు, ప్లాట్లలోకి వినియోగిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## రెండు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న ఇసుక సరిహద్దు వివాదం

బోధన్ సాలుర/జూన్ 5/(జన సంఘర్షణ)




తెలంగాణ-మహారాష్ట్ర జాయింట్ రెవెన్యూ సర్వేకు మహారాష్ట్ర అధికారులు గైర్హాజరయ్యారు.

ఈ సర్వేలో పాల్గొనాల్సిన మహారాష్ట్ర రెవెన్యూ, సర్వే అధికారుల,కోసం తెలంగాణ యంత్రాంగం ఉదయం నుంచి ఎదురుచూసింది. అయితే అటువైపు నుంచి అధికారుల జాడ కనిపించలేదు. ఎలాంటి సమాచారం కూడా లేదు. ఒక పక్క అధికారుల సర్వేకు రంగం సిద్ధమవుతున్నప్పటికీ మహారాష్ట్ర ఇసుక మాఫియా మాత్రం ఏమాత్రం భయం లేకుండా తమ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉందని సమాచారం సర్వే జరుగుతోందన్న విషయాన్ని సైతం ఏమాత్రం లెక్కచేయకుండా వారి భూభాగంలో యథేచ్ఛగా ఇసుకను తవ్వుతున్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దుల వద్ద అధికారులు ఉన్నారన్న భయమే లేకుండా రవాణాను ఆపకుండా బహిరంగంగానే ఇసుకను దోచేస్తుండటం గమనార్హం.ఉదయం నుంచి ఎదురుచూసినా పత్తాలేరు. ఈసర్వేలో పాల్గొనాల్సిన మహారాష్ట్ర రెవెన్యూ, సర్వే అధికారుల, కోసం తెలంగాణ యంత్రాంగం ఉదయం నుంచి ఎదురుచూసింది. ఒక పక్క అధికారుల సర్వేకు రంగం సిద్ధమవుతున్నప్పటికీ మహారాష్ట్ర ఇసుక మాఫియా మాత్రం ఏమాత్రం భయం లేకుండా తమ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉందని సమాచారం. సర్వే జరుగుతోందన్న విషయాన్ని సైతం ఏమాత్రం లెక్కచేయకుండా వారి భూభాగంలో యథేచ్ఛగా ఇసుకను తవ్వుతున్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దుల వద్ద అధికారులు ఉన్నారన్న భయమే లేకుండాతమ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉందని సమాచారం. సర్వే జరుగుతోందన్న విషయాన్ని సైతం ఏమాత్రం లెక్కచేయకుండా వారి భూభాగంలో యథేచ్ఛగా ఇసుకను తవ్వుతున్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దుల వద్ద అధికారులు ఉన్నారన్న భయమే లేకుండా రవాణాను ఆపకుండా బహిరంగంగానే ఇసుకను దోచేస్తుండటం గమనార్హం.

## నాకు న్యాయం జరిగేది ఎన్నడు

వర్ని/జూన్ 5/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా వర్ని మండలం కూనిపూర్ గ్రామ పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి తనకు కులం నుంచి కొంత మంది ఏలేశారు అని తనకు అన్యాయం జరుగుతుందని గత కొన్ని సంవత్సరాలు నుంచి న్యాయం కోసం ప్రభుత్వ కార్యాల చుట్టూ అధికార యంత్రాంగం చుట్టూ తిరుగుతున్న తనకు న్యాయం జరగడం లేదని వినతి పత్రాలు ఫుల్ గా ఇచ్చినప్పటికీ ఇప్పటికీ న్యాయం జరగలేదని రాజకీయ వివక్ష వల్ల తనకు న్యాయం జరగడం లేదని రాజకీయ ఆశక్తులు తనకు అన్యాయం చేస్తున్నారని ఇప్పటికైనా తనకు న్యాయం జరగాలని న్యాయం కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ చేస్తున్నప్పటికీ బాధితుడికి న్యాయం జరిగేది ఎప్పుడూ అని గ్రామం చెందిన ఓ బాధితుడు తన బాధ ఇలా విన్నవించాడు.

## రుద్రూరు చెరువు ప్రాంతంలో ప్రతిరోజు జోరుగా పేకాట

రుద్రూర్/జూన్ 5/(జన సంఘర్షణ)



జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని చెరువు కట్ట ప్రాంతంలో ప్రతిరోజు రాత్రి భారీగా పేకాట నడుస్తుందని పేకాట నిర్వాహకులు కొంతమంది జోరుగా పేకాట కొనసాగిస్తున్నారని డే పూట కూడా పేకాట జోరుగా నిర్వహిస్తున్న వైనం నెలకొంటుందని దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## రుద్రూర్ కరెంట్ ఏఈ వర్ని కరెంట్ ఇంచార్జి కారుతో యువకుడికిడి రెండు చేతులు డ్యామేజ్

వర్ని/జూన్ 5/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా వర్ని మండలం వర్ని జాకోర ఎక్స్ రోడ్డు వద్ద గత శనివారం నాడు రుద్రూర్ కరెంట్ ఏఈ వర్ణికరెంట్ ఇన్చార్జి ఏఈ తన కారుతో బైక్ పై వెళు తున్న వ్యక్తికి ఢీకొనడంతో వ్యక్తికి చెందిన రెండు చేతులు విరిగిపోయినట్టు స్థానికులు తెలిపారు, నిన్న అనగా గురువారం నాడు వర్ని పోలీస్ స్టేషన్లో ఈ పంచాయతీ నడిచింది. కరెంట్ ఏఈ అశ్రద్ధ వలనే ఈ ప్రమాదం జరిగిందా అనే అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

## సర్వే చేయాలంటే లంచం ఇవ్వాల్సిందే

- ప్రైవేట్ అసిస్టెంట్ ల ద్వార వసూళ్లు...

కరీంనగర్/జూన్ 5/(జన సంఘర్షణ)



భూమిని సర్వే చేసి రిపోర్టు కావాలంటే లంచం ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేసి డబ్బులు తీసుకుంటున్న సర్వేయర్ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.తన చేతికి మట్టి అంటకుండా మండలం లో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను సహాయకులుగా పెట్టుకుని లంచం తీసుకుంటున్న సర్వేయర్ ను అవినీతి నిరోధక శాఖాధికారులు శుక్రవారం పట్టుకున్నారు.. కరీంనగర్ ఎసిబి డిఎస్పీ విజయ్ కుమార్ తెలిపిన కథనం ప్రకారం... కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలానికి ఎక్కల దేవి కుమార స్వామి సర్వేయర్ గా పనిచేస్తున్నారు. అదే మండలానికి చెందిన తీగల రాజేష్, వంగా విహిత్ రెడ్డిలను వ్యక్తిగత సహాయకులుగా నియమించుకుని లంచాలకు సర్వే చేయడం రిపోర్టులు ఇవ్వడం చేస్తున్నారు. సైదాపూర్ మండలం అమ్మన్ గుర్తి గ్రామానికి చెందిన వ్యక్తి తన భూమి సర్వే కోసం రెవెన్యూ శాఖలో దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత వ్యక్తి భూమి సర్వే చేయాలంటే రూ.25,000 డిమాండ్ చేశారు సర్వేయర్ కుమార స్వామీ. సర్వేయర్ వ్యక్తిగత సహాయకుడు వంగ విహిత్ రెడ్డి ద్వార యుపిఎ గా రూ.5000 లంచం గత నెల 23న స్వీకరించారు. అతని ద్వారా రూ.10 వేలు నగదు రూపంలో తీసుకున్నారు. శుక్రవారం సర్వేయర్ కుమారా స్వామి తన వ్యక్తిగత సహాయకుడు తీగల రాజేష్ ద్వార 10 వేలు స్వీకరిస్తుంది రెడ్ హ్యాండేడ్ గా పట్టుకున్నారు. ఈ కేసులో సర్వేయర్ తోపాటు ఇద్దరు ప్రైవేట్ సహాయకులను అరెస్టు చేసి కరీంనగర్ ఎసిబి కోర్టులో హాజరు పరుచగా రిమాండ్ విధించినట్లు ఎసిబి డిఎస్పీ తెలిపారు...

## భీమ్గల్: నీటి కుంటలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

భీమగల్/ జూన్ 5/(జన సంఘర్షణ)



భీమగల్ మండలం లింబాద్రిగుట్ట వడ్డెర కాలనీకి చెందిన అరవింద్ (4), వర్షిని (5), హరీశ్ (10) శుక్రవారం బ్రాహ్మణకుంటలో మునిగి మృతి చెందారు. ఎస్ఐ తిరుపతి వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ఆడుకుంటూ వెళ్లిన పిల్లలు స్నానం కోసం కుంటలోకి దిగారు. ఈత రాక కుంటలో మునిగిపోయారు. తండ్రి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనతో కాలనీలో విషాదం నెలకొంది.

## చెట్టుకు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నిజామాబాద్ గుండారం/జూన్ 5/(జన సంఘర్షణ)



నిజామాబాద్ గుండారం ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణం చెందినట్లు రూరల్ టౌన్ ఎస్హెచ్వో శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. నగరంలోని గాజులపేటకు చెందిన సర్దార్ తేజ సింగ్ ఏ దయాల్ సింగ్ (35) మద్యానికి బానిస అయ్యాడు. దీంతో అతని భార్య పుట్టింటికి వెళ్లింది. ఒంటరితనంతో మద్యానికి బానిసైన తేజ సింగ్ గుండారం శివారులో చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని హస్బి పూర్ణిమ పిలుపు



**జహీరాబాద్ :**
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ వేమారెడ్డి కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆత్మనిర్భార్ మహిళా యోజన, విశ్వ మాంగళ్య మహాసభ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ హస్బి పూర్ణిమ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరుణ కౌలాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హస్బి పూర్ణిమ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, వరదలు, గాలి--నీటి కాలుష్యం వంటి సమస్యలు పర్యావరణ అసమతుల్యత కారణంగానే వస్తున్నాయని, చెట్ల పెంపకం ద్వారా వాటిని తగ్గించవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

## పటాన్చెరులో 'ఏక్ పేడ్ మా కే నామ్

**తల్లి పేరు మీద మొక్కలు నాటిన ఎమ్మెల్సీ డాక్టర్ సి.అంజి రెడ్డి.**



**సంగారెడ్డి:**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం పటాన్చెరు నియోజకవర్గం, రామచంద్రాపురంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ సి. అంజి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ ఇంఛార్జిగా ముష్యం శ్రీనివాస్



**ఉప్పల్ :**
ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత వేగం తీసుకురావాలనే ఉద్దేశంతో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జిగా ముష్యం శ్రీనివాస్ను నియమించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నియామక సందర్భంగా మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, డివిజన్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని ముష్యం శ్రీనివాస్కు సూచించారు. తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన ముష్యం శ్రీనివాస్, పార్టీ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేస్తూ, కార్యకర్తలతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ నియామకంతో ఉప్పల్ డివిజన్లో పార్టీ కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెరుగుతుందని నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## కోలేటి దామోదర్ గుప్త జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్**
పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై కోలేటి దామోదర్ గుప్తను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజా జీవితంలో కోలేటి దామోదర్ గుప్త అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవలందించాలని ఆకాం క్షించారు. వేడుకల్లో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని కోలేటి దామోదర్ గుప్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# శాత్రాజుపల్లి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

**కలెక్టర్,మైనింగ్ అధికారికి గ్రామస్థుల ఫిర్యాదు**



**వేములవాడ**
:వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ చెరువులో అనుమతికి మించి మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ గ్రామస్థులు, రైతులు జిల్లా కలెక్టర్తో పాటు జిల్లా మైనింగ్ అధికారికి శుక్రవారం ఫిర్యాదు చేసి వెంటనే మట్టి తరలింపును నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శాత్రాజుపల్లి గ్రామ చెరువు నుంచి 1000 క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే తరలించేందుకు జగిత్యాలకు చెందిన కాంట్రాక్టర్లు కావటి గంగధర్, బొడ్డుపెల్లి జగన్రాజుకు అనుమతి మంజూరైందని, అయితే గత ఐదు రోజులుగా మూడు పోక్లెయిన్లు, సుమారు 50 టిప్పర్ల సహాయంతో అనుమతికి మించి పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే దాదాపు 10 వేల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టిని చెరువు నుంచి తరలించారని, ఇంకా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. దీంతో చెరువులోని నల్లమట్టి పూర్తిగా తొలగిపోయే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో గ్రామ ప్రజలు, రైతులకు అవసరమైన మట్టి అందుబాటులో లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులను ఉల్లంఘించి మట్టి తరలింపునకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేసి గ్రామ ప్రజల, రైతుల ప్రయోజనాలను కాపాడాలని జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారిని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, వేములవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గుడిసె సదానందం, మాజీ ఉపసర్పంచ్ లు రేగుల రాజేశం, నల్ల సతీష్ రెడ్డి, మ్యాకల శ్రీనివాస్, గుడిసె అనిల్, శివ శ్రీనివాస్, మ్యాకల కరుణాకర్ తదితరులు ఉన్నారు.

# ఉద్యోగాల పేరుతో లక్షల రూపాయల వసూళ్లు..?

- **వంద మందికి పైగా నిరుద్యోగుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు**
- **రూ.20 లక్షలకుపైగా వసూళ్లు చేసినట్లు బాధితుల ఫిర్యాదు**
- **సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**ఉప్పల్ :**
ఉద్యోగాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి పలువురు నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వెలువడుతున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై బాధితులు వివిధ జిల్లాల్లో పోలీసులకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. బాధితుల కథనం ప్రకారం, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాకు చెందిన కొమ్ము కార్తీక్, మందల వెంకటేష్, గజ్జి శేఖర్ యాదవ్, భువనగిరి జిల్లాకు చెందిన బాబీ వేణు మాధవ్, నల్గొండ జిల్లాకు చెందిన పల్లె వెంకన్న తదితరులు ఓ ప్రైవేటు సంస్థలో భద్రతా సిబ్బంది ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగంలో చేరిన తర్వాత రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు ఉద్యోగ భద్రత ఉంటుందని హామీ ఇవ్వడంతో పలువురు అప్పులు చేసి డబ్బులు చెల్లించినట్లు బాధితులు తెలిపారు. అనంతరం ఉద్యోగాల విషయంలో స్పష్టత లేకపోవడం, సంబంధిత వ్యక్తులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అనుమానాలు వ్యక్తమైనట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సంస్థ యాజమాన్యానికి సమాచారం అందడంతో అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. బాధితుల నుంచి వరుస ఫిర్యాదులు రావడంతో విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వంద మందికి పైగా నిరుద్యోగుల నుంచి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. తమ వద్ద ఉన్న రసీదులు, వీడియోలు, ఫోన్ సంభాషణల వివరాలు తదితర ఆధారాలను పోలీసులకు, సంస్థ యాజమాన్యానికి అందజేసినట్లు తెలిపారు. నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కూడా ఈ వ్యవహారానికి సంబంధించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు చెల్లించే ముందు సంబంధిత సంస్థల నియామక ప్రక్రియ, అధికారిక పత్రాలు, సంస్థ విశ్వసనీయతను తప్పనిసరిగా పరిశీలించాలని యాజమాన్యం సూచించింది. ఇలాంటి మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కోరింది.

# హౌసింగ్,రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్**
ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన హౌసింగ్, రెవెన్యూ శాఖల పరిధిలో ఉన్న పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు గృహ వసతి కల్పన, పెండింగ్లో ఉన్న హౌసింగ్ సమస్యల పరిష్కారం, భూ సంబంధిత అంశాలు, రెవెన్యూ సమస్యలు, ప్రజల నుంచి అందిన వినతులు తదితర విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను సానుకూలంగా పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లిలో స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులపై జైలు సూపరింటెండెంట్తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్చ



**ఉప్పల్ :**
చర్లపల్లి డివిజన్కు చెందిన పలు కాలనీల్లో ఎన్నో సంవత్సరాలుగా స్టార్మ్ వాటర్ డ్రైన్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షాకాలంలో మురుగునీరు బయటకు వెళ్లక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించడంతో పాటు టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేయించారు. ఈ నేపథ్యంలో పనులు వేగంగా ప్రారంభమై సజావుగా కొనసాగేందుకు అవసరమైన సహకారం అందించాలని కోరుతూ చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్ భరత్ రెడ్డిని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చర్లపల్లి డివిజన్ ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. పనుల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలని కోరారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధే తమ లక్ష్యమని, చర్లపల్లి డివిజన్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co